ఆంధ్రజ్యోతి


****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

సోమవారం 26 మే 2025



మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో 7

డిగ్రీ పరీక్షల్లో 27 మంది
విద్యార్థుల డిబార్



చందంపేట-దేవరచర్ల రహదారి దుస్థితి



పిట్టంపల్లి-నల్లగొండ రోడ్డు

రహదారుల విస్తరణలో జాప్యం

- అత్యవసర పనులకు మోక్షం కరువు
- భారీగా రోడ్ల పనులు చేపట్టినా బిల్లుల జాప్యంతో నత్తనడకన
- దశాబ్దాలుగా మరమ్మతులకు నోచని రోడ్లపై దృష్టి పెట్టాలంటున్న స్థానికులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రహదారుల పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. భారీగా రోడ్ల విస్తరణ, మరమ్మతుల పనులు చేపట్టగా, పనుల ఆలస్యంగా కారణంగా ఆయా ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సమీపిస్తుండడంతో రోడ్ల విస్తరణతోపాటు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, లేదంటే వానాకాలంలో ఇబ్బందులు తప్పని స్థానికులు వాపోతున్నారు. మరమ్మతుల నిమిత్తం ఇప్పటికే అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించినా, ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోవడంతో ప్రతిపాదనలు సమర్పించడం లేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40కి పైగా రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటికితోడు వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 500 కిలోమీటర్ల పైచిలుకు రోడ్లకు ప్యాచ్‌లు చేయాల్సి ఉంది. వీటన్నింటినీ తక్షణం చేపట్టేందుకు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



దెబ్బతిన్న కాసనగూడ రహదారి

నల్లగొండ జిల్లాలో నాలుగులేన్ల రోడ్ల విస్తరణ పనులకు 20 రహదారులను ఎంపికచేశారు. ఈ పనులన్నీ ప్రారంభమై ఏడాది దాటుతుండగా, బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా పనులు వేగంగా సాగడం లేదు. సుమారు రూ.400కోట్ల అంచనావ్యయంతో చేపట్టిన ఈ రోడ్లు పూర్తయితే దాదాపు 397కిలోమీట ర్ల మేర ప్రధాన రహదారి సదుపాయం కలుగుతుంది. కీలకమైన ముషంపల్లి-కన్నెకల్ రోడ్డు, దేవరకొండ పట్టణంలోని రోడ్లు, చండూరు(బంగారిగడ్డ)-నాంపల్లి-కొండమల్లేపల్లి, వంటి ప్రధాన రోడ్లు ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు కీలకమైన యాదాద్రి పవర్‌స్టేషన్‌ను అనుసంధానించే దామరచర్ల-వీర్లపాలెం ప్రధాన రహదారిని సైతం నాలుగులేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదించినా పనులు ప్రారంభం కాలేదు.

» జిల్లాలో గత వానాకాలంలో గుంతలుపడ్డ 59కిలోమీటర్ల రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రతిపాదించినా, ఇంకా నిధులు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఈ నెలలో పనులు చేపట్టే అవకాశం ఉందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

» నార్కట్‌పల్లి మండల కేంద్రంలో పూర్వజాతీయరహదారి విస్తరణ పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు రూ.16కోట్లతో చేపట్టారు. ఈ రోడ్డు అసంపూర్తిగా మిగిలింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం పూర్తిచేయకపోవడంతో వర్షాకాలం లో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద వర్షపునీరు నిలిచి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. రెండు జాతీయరహదారుల జంక్షన్ అయిన నార్కట్‌పల్లిలో ఈ పరిస్థితి నెలకొనడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

» కేతేపల్లి మండలంలో 65వ నెంబర్ జాతీయ రహదారి నుంచి కాసనగోడు వరకు రూ.1.17 కోట్ల ఎంఆర్ఆర్ (మె యింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్) నిధులతో చేపట్టాల్సిన మరమ్మతులు చేయడం లేదు. 2023లో ఈ పనులకు అప్పటి ప్రభుత్వ హయాంలో శిలాఫలకం వేశారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో కొత్తపేట, గుడివాడ, కాసనగోడు, బొప్పారం గ్రామానికి చెందినవారితో పాటు, మూసీ ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

» కట్టంగూరు మండలం పిట్టంపల్లి నుంచి నల్లగొండ మండలం మర్రిగూడ బైపాస్ వరకు 5.500కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.9.6కోట్ల నిధులు మంజూరయ్యాయి. కల్వర్టులు, సీసీ పనులు కొనసాగుతున్నాయి. అయితే పనులు వేగంగా చేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

» కట్టంగూరు నుంచి కురుమూర్తికి వెళ్లే 8కిలోమీటర్ల రహదారి గుంతలమయంగా మారి అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డును డబుల్‌లేన్లగా విస్తరించాలనే డిమాండ్ ఉన్నా, ప్రస్తుతానికి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

» జడ్చర్ల-కోదాడ జాతీయరహదారిపై అంగడిపేట ఎక్స్ రోడ్డు నుంచి పీఏపల్లి మండల కేంద్రానికి వెళ్లే డబుల్‌రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈరోడ్డును 20 ఏళ్ల క్రితం ఏర్పాటుచేయగా, ఆ తర్వాత అడపాదడపా మరమ్మతులే తప్ప పూర్తిస్థాయిలో పునర్నిర్మాణం చేయలేదు.సుమారు 5 కిలోమీటర్లు ఉండే ఈ రోడ్డుని విస్తరించాలని, పూర్తి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

» మనుగోడులోని ప్రధాన కూడలిలో రూ.24కోట్లతో సుమారు 2.5కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

» చండూరు మండలం బంగారిగడ్డ నుంచి నాంపల్లి మీదుగా కొండమల్లేపల్లి వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులను రూ.60.80కోట్లతో చేపట్టారు. ఈ పనులు ఆలస్యంగా కొనసాగుతుండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

» చండూరు నుంచి మర్రిగూడ రోడ్డు దారుణంగా తయారైంది. 12కిలోమీటర్ల ఈ రహదారికి రూ.30కోట్ల నిధులు మంజూరయ్యాయి. నేటివరకు పనులు ప్రారంభం కాలేదు.

» చండూరు నుంచి తాస్కానిగూడెం వరకు 4కిలోమీటర్లకు రూ.13కోట్లు మంజూరవగా, చండూరు-గట్టుప్పల్-నారాయణపురం రోడ్డుకు రూ.30కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.

» మునుగోడు-నాంపల్లి రోడ్డులో మేజర్, మైనర్ బ్రిడ్జిలు ఐదింటికి రూ.17కోట్లు మంజూరవగా, టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

» చండూరు-కస్తాల-గుర్రంపోడు రహదారి దారుణంగా మారినా పట్టించుకునే నాథుడు లేదు.

ఎస్ఎల్‌బీసీ పనులను మేమే పూర్తి చేస్తాం

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి

కట్టంగూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగమార్గం పనులను తమ హయాంలోనే పూర్తిచేస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయిటిపాముల వద్ద రూ.100కోట్లతో చేపడుతున్న ఎత్తిపోతల పథకం పనులపై నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన శనివారం రాత్రి సమీక్షించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం వెళ్తున్న 44కి.మీ భూమికి ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే నిర్వహించేందుకు డెన్మార్క్ నుంచి హెలికాప్టర్ తెప్పించి లైడార్ సర్వే చేయించనున్నట్టు తెలిపారు. అత్యంత ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి టన్నెల్ మిగతా పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేస్తామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కృష్ణా, గోదావరి జలాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులతో పాటు రాష్ట్రానికి చెందిన రైతాంగానికి నష్టం జరిగిందన్నారు. కృష్ణా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల నీటిని కేటాయిస్తే 512 టీఎంసీలు ఆంధ్రకు, 299 టీఎంసీల నీరు తెలంగాణకు సరిపోతుందని రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. కానీ, తాము అధికారంలోకి వచ్చాక కృష్ణా జలాల్లో వాటాను 70శాతం వరకు తెలంగాణకు కేటాయించాలనే వాదనను బచావత్ ట్రిబ్యునల్ ముందు ఉంచడంతో పాటు గతంలో ఇచ్చిన తీర్పును రీఓపెన్ చేయించినట్లు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా పనులు చేయిస్తున్నామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోకి వచ్చే గంధమల్ల ఎత్తిపోతల భూ సేకరణ సమస్యను దృష్టిలో ఉంచుకుని సామర్థ్యాన్ని తగ్గించి పనులు ప్రారంభించేలా ఆదేశించినట్లు తెలిపారు.

బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు రూ.500కోట్లు కేటాయించామని, పనుల వేగవంతానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని ఆసిఫ్‌నగర్ నుంచి అనుసంధానించి డిసెంబరు లోపు సాగునీరు అందించాలని కోరారు. అయిటిపాములతో పాటు బస్వాపురం, గంధమల్ల ద్వారా సాగునీరు అందిస్తే 50,000 ఎకరాలకు నీరు అందుతుందని, అలాగే బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వను పూర్తిచేసి ఎత్తిపోతల ద్వారా నీరందిస్తే నకిరేకల్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఐబీ సీఈ అజయ్‌కుమార్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయంపై సమీక్షలతోనే సరి!

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగంపై సమీక్షలతోనే సరిపెడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీజన్లు వచ్చిపోతున్నా రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు దక్కడం లేదు. రైతుభరోసాతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై స్పష్టత కరువైంది. సీఎం రేవంత్‌రెడ్డి వారం క్రితం మంత్రులు, అధికారులతో వ్యవసాయరంగంపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 23 నుంచి రైతు భరోసా సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించినా, ఇప్పటి వరకు ట్రెజరీల నుంచి నిధులు విడుదల కాలేదు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

- రైతులకు దక్కని సంక్షేమం, అభివృద్ధి పథకాలు
- రైతు భరోసాపై స్పష్టత కరువు
- యాసంగిలో ఇచ్చిన పెట్టుబడి సాయం నామమాత్రమే
- వానాకాలం సీజన్ ముంచుకొస్తున్నా కలగని ఊరట

రైతు భరోసాను గత మార్చి నెలలోనే పూర్తిస్థాయిలో ఇస్తామని పలుమార్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు. గత మార్చి నెలలో నాలుగు ఎకరాలలోపు రైతులకు మినహా ఆపైగా భూమి ఉన్న రైతులకు రైతుభరోసా అందలేదు. ఈ ఏడాది జనవరి 26న ప్రభుత్వం లాంఛనంగా, పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 గ్రామాలను ఎంపిక చేసి నూటికి నూరుశాతం ఆయా గ్రామాల్లో రైతుభరోసాను అమలు చేసింది. ఆ గ్రామాల్లో ఎంత భూమి ఉన్నా రైతులకు పూర్తి స్థాయి భరోసా సొమ్మును విడుదలచేసింది. ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ఎకరాల వరకు రైతులకు రైతుభరోసాను అమలు చేశారు.

రైతుభరోసా ఎన్ని ఎకరాలకో?

రైతుభరోసా ఎన్ని ఎకరాల వరకు ఇస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. సాగు చేస్తున్న భూమి మొత్తానికి రైతుభరోసా ఇస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ప్రతీ రైతు రైతుభరోసా కోసం ఎదురు చూస్తున్నారు. ఆ తరువాత ప్రభుత్వం రైతుభరోసాపై ఉమ్మడి జిల్లాల స్థాయిలో సహకారసంఘాలకు చెందిన రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలనే దానిపై అభిప్రాయాలు సేకరించిన ప్రభుత్వం ఆ ఫైల్‌ను ఆటకెక్కించింది. అభిప్రాయాలను తీసుకున్న తరువాత అసెంబ్లీలో చర్చపెట్టి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, తీరా అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టింది. రైతుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం జనవరి 26న రైతుభరోసా ప్రక్రియ ప్రారంభించినా, పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో వ్యవసాయ.

- మిగతా 7వ పేజీలో...

యాంత్రీకరణ నిధులు రూ.3.60కోట్లు ఫ్రీజింగ్

ఈ ఏడాది మార్చి నెలలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి దరఖాస్తులు తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడేళ్లపాటు యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత యాంత్రీకరణపై దృష్టి సారించి దరఖాస్తులు తీసుకుంది. ప్రస్తుతం దరఖాస్తులతోనే సరిపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.3.60కోట్లు కేటాయించింది. యాదాద్రి జిల్లాకు 240 పరికరాలకు రూ.72లక్షలు, సూర్యాపేట జిల్లాకు 457 పరికరాలకు రూ.1కోటి, నల్లగొండ జిల్లాకు 820 యాంత్రీకరణ పథకాలకు రూ.1.88కోట్లను ప్రకటించారు. అయితే ఈ నిధులను ట్రెజరీకి విడుదల చేసి పరికరాలను కొనుగోలు చేయాల్సి ఉండగా, ట్రెజరీలోనే నిధులను ఫ్రీజింగ్ చేశారు. మళ్లీ ఈ ఏడాది కొత్తగా యాంత్రీకరణకు నిధులు కేటాయించి, గతంలో కేటాయించిన నిధులను విడుదల చేసే ఆలోచనలక్ష ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. దీంతో ఇప్పట్లో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలయ్యే అవకాశాలు కన్పించడం లేదు.





పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రశాంతంగా గ్రామ పాలనాధికారుల పరీక్ష

నల్లగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష ప్రారంభమైన వెంటనే కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు, గైర్హాజరైన వారి వివరాలు, కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, బందోబస్తును పరిశీలించారు. గ్రామ పరిపాలనాధికారులు పరీక్షకు 276 మందికి 241 మంది హాజరు కాగా, 35మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) రాజ్‌కుమార్, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.

నేడు టీపీఎస్వీ ప్రచారజాత ప్రారంభం

నల్లగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న ప్రచారజాతాను ప్రారంభించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలనే సందేశంతో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో ప్రచారజాతా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ప్రచారజాతాను మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటిరోజు నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడలో ప్రచారజాతా కొనసాగుతుందని తెలిపారు. 27న హాలియా, కొండమల్లేపల్లి, దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో కొనసాగుతుందని వెల్లడించారు. ఈ ప్రచారజాతాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గిరిజనులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

హాలియా,మే25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం (టీఆర్‌జీఎస్) శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతితో గిరిజన రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోందని, అందులో భాగంగానే తిరుమలగిరి సాగర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతులకు పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గిరిజనులను ఐక్యం చేసి హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలని అన్నారు. ఎస్టీలకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ. 25లక్షలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూములు పట్టాలు పొందిన రైతులకు నీటి వసతి, పెట్టుబడి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూడియా బాబు పీఠాధిపతి భగవాన్‌నాయక్, సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, నాయకులు రమావత్ శంకర్‌నాయక్, లాల్‌సింగ్, రమావత్ లలితాభాయ్, రమావత్ జవహర్‌నాయక్, ఆంగోతు వెంకన్న, చంద్రుడు, రాగ్యానాయక్, శ్రీను, సురేష్, భాస్కర్, అశోక్, లాలు, రమేష్, రాజు, శ్రీను, పాల్గొన్నారు.

భారత జవాన్లకు అండగా నిలుస్తాం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కేతావత్ లాలునాయక్ » దేవరకొండలో ఆపరేషన్ తిరంగా ర్యాలీ



దేవరకొండలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, వివిధ పార్టీల నాయకులు

దేవరకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు అండగా నిలుస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన తిరంగా ర్యాలీని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ భారత జవాన్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పాకిస్థాన్‌తో పాటు ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. జమ్మూకాశ్మీర్ పహల్గాంలో అమాయక పర్యాటకులను తీవ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించి, దేశ ప్రజలకు భరోసా కల్పించినట్లు తెలిపారు. భారత ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటి కృష్ణ, రాష్ట్ర నాయకులు కల్యాణ్‌నాయక్, కర్నాటి సురేష్, నక్క వెంకటేష్‌యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, నాయకులు బెజవాడ శేఖర్, పున్న వెంకటేశ్వర్లు, సుదర్శన్, లింగయ్య, చనమోని రాములు, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వీటీతో పాటు దేవరకొండ నియోజకవర్గానికి వివిధ పార్టీల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.







అప్పటి వరకు సూరీడు భగభగమన్నాడు. ఎండతో ఉక్కపోసిన వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సంధ్య వేళ సూరీడు కనుమరుగైనదే తడవుగా నల్లగొండ జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం నింగీ నేలా కలిసిపోయాయా అన్నట్లుగా కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఆకాశం నీలివర్ణంగా మారి కనువిందు చేసింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ.

11 మూగజీవాలు మృత్యువాత



మేళ్లచెర్వులో పిడుగుపడి మృతిచెందిన మేకలు

మేళ్లచెర్వు, మే 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో 11 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని కందిబండ శివారులో పిడుగుపాటుకు గురై ఏడు మేకలు మృతిచెందాయి. ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి మండలకేంద్రంలోని సుంకరబోయిన సైదులుకు చెందిన నాలుగు మేకలు, హనుమంతరావుకు చెందిన రెండు మేకపోతులు, అచ్చిరెడ్డికి చెందిన ఒక మేకపోతు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

డిండి: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా డిండి మండలం తవక్లాపూర్‌లో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన నూకం పార్వతమ్మ, నూకం రమణమ్మ తమ గేదెలను మేపేందుకు పొలానికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి కురిసిన గాలివాన, ఈదురుగాలులకు పొలంలోని విద్యుత్ ఎల్టీలైన్ తెగిపడింది. గేదెలు మేసుకుంటూ వెళ్లి తెగిపడిన విద్యుత్ వైర్లకుతగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాయి. గేదెల విలువ సుమారు రూ.1.40లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

శాలిగౌరారం: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న ఎద్దు విద్యదాఘాతంతో మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో జరిగింది. చిత్తలూరు గ్రామంలో తరాల వీరయ్యకు చెందిన ఎద్దు గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని బాధితుడు వీరయ్య తెలిపాడు. విద్యుత్ అధికారులు తనకు నష్ట పరిహారం చెల్లించాలని కోరాడు.

భువనగిరి రూరల్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి శివారులోని రాయిగిరిలో జరిగింది. గ్రామానికి చెందిన చింతల నరేశ్‌కు చెందిన పాడిగేదె రోజు వారి మాదిరిగా పచ్చ గడ్డిని మేస్తుండగా విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు అనుకుని ఉండడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు వాపోయాడు.

యువకుడి ప్రాణం తీసిన ఘర్షణ

దేవరకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని అంజయ్యకాలనీలో జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరకొండ సంజయ్‌కాలనీలో కున్‌రెడ్డి అంజయ్య దశదిన కర్మకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పట్టణానికి చెందిన కార్తీక్(16), అతని బావ చరణ్ వచ్చారు. కార్యక్రమం అనంతరం రాత్రి కార్తీక్, అతని బావ చరణ్‌లు పక్కనున్న జంగాలకాలనీకి వెళ్లారు. జంగాలకాలనీలో అంజయ్య కాలనీకి చెందిన సంపంగి చిన్న సైదులు, సిద్దులు బైక్‌పై వచ్చారు. అక్కడ సిద్దులు ఫోన్‌లో మాట్లాడుతున్న విషయంలో కార్తీక్‌తో గొడవపడ్డారు. సిద్దులు కార్తీక్‌ను తిడుతూ క్షణికావేశంలో తాను వచ్చిన బైక్ బంపర్‌పైపు తీసి కార్తీక్ తలపై కొట్టాడు. దీంతో కార్తీక్ స్పృహ కోల్పోయాడు. గమనించిన చరణ్, బంధువులు కార్తీక్‌ను హుటాహుటిన దేవరకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కార్తీక్ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కార్తీక్ అమ్మమ్మ ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శివశక్తి అనుగ్రహ ఆశ్రమపీఠంలో డ్రోన్ల కలకలం



భువనగిరి రూరల్, మే25(ఆంధ్రజ్యోతి): శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠంపైన శనివారం అర్ధరాతి డ్రోన్ల కలకలం సృష్టించింది. దీంతో భద్రత సిబ్బంది అప్రమత్తమై భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులోని శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం విస్తరించి ఉంది. అందులో బంగారు శివలింగంతోపాటు స్ఫటిక శివ లింగం, సహస్ర కోటి శివలింగాలు, శ్రీచక్రాలు, వివిధ దేవతామూర్తుల ఖరీదైన విగ్రహాలు ప్రతిష్ఠించారు. అయితే శనివారం అర్ధరాత్రి ఆలయం చుట్టూ మూడు డ్రోన్ కెమెరాలు తిరుగుతుండడం గమనించిన ఆశ్రమ భక్తులు భయ భ్రాంతులకు గురయ్యారు. ఆలయ నిర్వాహకుడు బలరాం ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు ఆశ్రమ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి సిద్దగురు రమణానంద మహర్షితో భేటీ అయ్యారు. డ్రోన్ కెమెరాల కలకలంకు సంబంధించి తాము సమగ్రంగా విచారణ చేపడతామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

చౌటుప్పల్ రూరల్, మే25(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగెడపల్లి గ్రామానికి చెందిన చెరుకు సత్తయ్య(52) గీత కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం తాటికల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి తాటిచెట్టుపై నుంచి పడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన సత్తయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్సపొందుతూ..

భువనగిరి రూరల్, మే25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఆత్మకూర్ మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన సంఘపాక నవీన్(31) ఈ నెల 15వ తేదీన భువనగిరి పట్టణంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలోని మండల పరిధిలోని అనంతారం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మూడు రోజుల పాటు చికిత్సపొందాడు. తర్వాత మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ కాకతీయ ఆసుపత్రిలో నాలుగు రోజుల పాటు చికిత్స పొందాడు. అక్కడి నుంచి తిరిగి ఈ నెల 23న హైదరాబాద్‌లోని పంజగుట్టలో గల నిమ్స్ ఆసుపత్రికి తీసుకవెళ్లగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు.

నల్లమట్టి కొల్లగొట్టి..



నసర్లపల్లిలో ఇటుక బట్టీలను పరిశీలిస్తున్న తహసీల్దార్(ఫైల్)

- కొన్ని ట్రిప్పులకే అనుమతి
- వందలాది ట్రిప్పులు తరలింపు
- దేవరకొండ పర్వతాలు చెరువు నల్లమట్టి తరలింపు

చింతపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి కొల్లగొడుతున్నారు. కొన్ని ట్రిప్పులకే అనుమతి తీసుకొని వందలాది ట్రిప్పుల మట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారు. దేవరకొండ పర్వతాలు చెరువు నుంచి మట్టిని సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి నుంచి నేరుగా చింతపల్లి మండలంలోని గొల్లపల్లి, కుర్మేడ్, నసర్లపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు తరలించాలి. కానీ రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి తరలుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. 50 ట్రిప్పులకు అనుమతి తీసుకొని 500 ట్రిప్పుల వరకు తరలిస్తున్నారని చెబుతున్నారు. దీంతో పాటు రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అర్కపల్లి నుంచి హైదరాబాద్‌కు కూడా నల్లమట్టి ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు.

ఐదు టిప్పర్ వాహనాల్లో రాత్రి పగలు తేడా లేకుండా హైదరాబాద్-సాగర్ రహదారిపై తరలిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అర్కపల్లి నుంచి మాల్ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా రెండు టిప్పర్లను ఈ నెల 21వ తేదీన యాచారం పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాడ్గుల మండలం నుంచి కులకులపల్లి నుంచి నేరుగా కుర్మేడ్, గొల్లపల్లి, మీదుగా తరలిస్తున్న టిప్పర్లను కుర్మేడ్ గ్రామస్థులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. పాత మాల్ నుంచి యాచారం మండలం మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు.



అధిక లోడ్‌తో టిప్పర్లు

టిప్పర్ల ద్వారా నల్లమట్టిని తరలిస్తుండగా అధిక లోడ్‌తో సాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై జోరుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. సాగర్-హైవేపై మట్టి కిందపడిపోవడంతో రహదారి పూర్తిగా మట్టితో నిండి పోతుంది. రోడ్డుపై నల్లమట్టి పడడంతో కొద్దిపాటి వర్షానికి రహదారి పూర్తిగా బురదమయంగా మారుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై వెళ్తూ అదుపుతప్పి పడుతున్నారు. నల్లమట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులు మాత్రం తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు.మైనింగ్ అధికారులు మాత్రం మట్టి రవాణాపై అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి



మండలంలోని గొల్లపల్లి, నసర్లపల్లి, తిర్మాలపురం, గొల్లపల్లి, కుర్మేడ్, వింజమూర్, ఉప్పరపల్లి, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి. ఇటుక బట్టీల నుంచి వెలువడే దుమ్ముధూళి వల్ల శ్వాసకోస వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకుంటే వ్యాధులు దరిచేరే అవకాశం ఉండదు.

- ఎండీ. రషీద్, వీటీనగర్, చింతపల్లి మండలం.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. మట్టి తరలించే ముందు నాలా అనుమతి తీసుకొని వాహనాలకు వే బిల్ పత్రాలు ఉంచుకొని మట్టి తరలించాలి. రాత్రి వేళ మట్టి తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

- రమాకాంత్‌శర్మ, చింతపల్లి తహసీల్దార్.

సరస్వతీ పుష్కరాలకు వెళ్లి వస్తూ..

● జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదం ● సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల వాసులకు గాయాలు

కాటారం, మే 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లి పుణ్యస్నానం చేసి కారులో బయలుదేరి వస్తున్న సూర్యాపేట జిల్లావాసులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాపరిధిలో 353(సీ) జాతీయ రహదారిపై కాటారం మండలకేంద్రం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్, ఎస్‌హెచ్‌వో గీతారాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన గెల్లి లక్ష్మీనర్సింహారావు కియా కారులో భార్య లక్ష్మీప్రసన్న, కుమార్తెలు ధనలక్ష్మి, నందిని, తేజస్వినితో కలిసి కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వచ్చి పుణ్యస్నానం చేశారు. అనంతరం తిరిగి కాటారం మీదుగా మేడారం వెళ్లడానికి బయలుదేరారు. హైదరాబాద్ బాలాపూర్ క్రాస్ రోడ్డు త్రివేణినగర్‌కు చెందిన సకోటే కిషన్‌లాల్, కాడికె దుర్గాజీలతో పాటు వారి కుటుంబసభ్యులు టవేరా వాహనంలో పుష్కర స్నానం చేసివద్దామని కాళేశ్వరం వెళ్తున్నారు. కాటారం మండలకేంద్రం శివారులో అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద కాళేశ్వరం నుంచి వస్తున్న కియా కారు వేగంగా ఎదురుగా వస్తున్న టవేరా వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో టవేరా ధ్వంసమై డోర్లు లోపలికి చొచ్చుకుపోవడంతో వాహనంలో ఉన్న సకోటే లలిత(61) తీవ్ర గాయాలతో మృతిచెందారు. సకోటే కిషన్‌లాల్, రాకేష్, సాయినంద, కాడికే దుర్గాజీ, పద్మ, సాయిప్రియ, రేణుక, నర్మద, డ్రైవర్ మల్లేష్ గాయపడ్డారు. టవేరా వానం ముందు భాగం ధ్వంసమైంది. దీంతో గాయపడిన వారు బయటికి రాలేకపోయారు. దీంతో అక్కడే అన్నదాన శిబిరం వద్ద ఉన్న వారు, పోలీసులు, స్థానికులు జేసీబీ సాయంతో కారు ముందు భాగాన్ని విడగొట్టి గాయాలతో ఉన్నవారిని బయటకు తీసి 108 అంబులెన్స్‌ల్లో వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఢీకొన్న కారులోని లక్ష్మీనర్సింహరావుతో భార్య, పిల్లలు గాయపడగా భూపాలపల్లి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.



కారు నుంచి క్షతగాత్రులను బయటికి తీస్తున్న స్థానికులు

విద్యార్థులు అన్నిరంగాల్లో అసక్తి పెంచుకోవాలి

సూర్యాపేటటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు అన్నిరంగాల్లో ఆసక్తి పెంచుకోవాలని చెస్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో అండర్-11, 17 ఉమ్మడి జిల్లా చెస్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. చెస్‌తో మేథోశక్తి పెంపొందుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని త్వరలో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అండర్-17 విభాగంలో ఏడుగురు, అండర్-11 విభాగంలో ఐదుగురిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సతీష్ కుమార్, శ్రీసాయికుమార్, గడ్డం లింగారెడ్డి, వెంకటమురళి, వెంకటేశ్వర్లు, రమేష్, మురళి, బిక్షం, సందీప్, కళ్యాణ్ పాల్గొన్నారు.

మీ పిల్లలను మా బడిలో చేర్పించండి



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న గోవిందాపురం పాఠశాల ఉపాధ్యాయులు

● ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం

హుజూర్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): 'మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించండి' అంటూ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. హెచ్‌ఎం గొట్టె శ్రీనివాసు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి కార్యక్రమాలు చేపడుతున్నారు. బడిబాట కార్యక్రమమే కాకుండా చదువుకునే పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ బడిలో చేర్పిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యకు బదులు ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. పట్టణంలోని గోవిందాపురంలోని 8, 9వ వార్డులలో సుమారు 1500 కుటుంబాలుఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో 44 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. కాగా మూడు సంవత్సరాల నుంచి 2023-24 లో 19 మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపికయ్యారు. 2024-25లో నలుగురు విద్యార్థులు, 2025-26 విద్యా సంవత్సరంలో ఆరుగురు విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించారు. గురుకులాకు పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికీ సీటు వచ్చిందని హెచ్‌ఎం తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి 1 నుంచి 4వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో 4వ తరగతి విద్యార్థులందరూ ప్రతిభా పాటవాలు కనబరుస్తున్నారు.

గురుకుల ఫలితాలు చూడండి.. మా బడిలో చేర్పించండి

'గురుకుల ఫలితాలు చూడండి.. మా ప్రభుత్వ బడిలో మీ పిల్లలను చేర్పించండి అంటూ ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నారు. కాగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయ వర్గాన్ని గోవిందాపురానికి చెందిన సీఐ బొల్లెద్దు సురేష్, ఎస్ఐలు చిలకబత్తిని ధనుంజయ్, పాలడుగు రాకేష్, ధనుంజయ్, మాజీ కౌన్సిలర్ సౌజన్య, మాజీ ఎంపీటీసీ ఇట్టిమళ్ల జ్యోతిశ్రీనివాసు అభినందించారు.

బకాయి రూ.64లక్షలు.. వసూలు 10లక్షలే

● సూర్యాపేట జిల్లాలో పేరుకుపోయిన చెరువుల లీజు బకాయి ● మొత్తం 864 చెరువులు ● 164 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు



సూర్యాపేటలోని ఓ చెరువులో చేప పిల్లలు వదులుతున్న మత్స్యకారులు(ఫైల్)

భానుపురి, మే 25(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో చెరువుల లీజు బకాయిలు పెరిగిపోతున్నాయి. వసూలు చేసేందుకు మత్స్యశాఖ చేస్తున్న ప్రయత్నాల్లో ముందడుగు పడడం లేదు. లీజు చెల్లించాలని అధికారులు అడిగితే చెరువుల నిండా నీరుందని, చేపలు పట్టలేదని చెబుతున్నారు. చిన్న, పెద్ద చెరువులు కలిసి జిల్లాలో మొత్తం 864 ఉన్నాయి. అదే విధంగా 164మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు రూ.64 లక్షల లీజు వసూలు కావాల్సి ఉందని, కేవలం రూ.10లక్షలు మాత్రమే వసూలు అయ్యాయని పేర్కొంటున్నారు. చెరువుల నిండా నీరందని, చేపలు పట్టుకోలేదని కొన్నిచోట్ల, మరికొన్ని చోట్ల చెరువుల నుంచి నీరు లేకుండా పోవడంతో చేపలు చనిపోయాయని కారణాలు చెబుతూ లీజు చెల్లించడం లేదని తెలుస్తోంది.

పాలకమండళ్లు లేని సంఘాలు ఎన్నో

సూర్యాపేట జిల్లాలో 164 సంఘాలు ఉండగా 125 సంఘాలకు మాత్రమే పాలకమండళ్లు ఉన్నాయి. ఇంకా 39 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఐదు సంఘాలకు పంచాయితీలు ఉండడంతో కోర్టు పరిధిలో ఉన్నాయి. పాలేఅన్నారం, గరిడేపల్లి, బూరుగడ్డ, చౌటపల్లి, టేకుమట్ల మత్స్యపారిశ్రామిక సంఘాలు కోర్టు పరిధిలో ఉండడం వల్ల ఎన్నికలు నిర్వహించలేదు. 19 మత్స్యకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌కు పంపించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. పాలారం, త్రిపురారం, బేతవోలు, లింగగిరి, అర్వపల్లి, తమ్మరబండపాలెం, ఎర్రారం, యాతవాకిళ్ల, రావిపహాడ్, సిరికొండ, ఉర్లుగొండ, శ్రీపురం, మామిడిపల్లి, యడవెల్లి, గుండ్లపహాడ్, ఇమాంపేట, పిల్లలమర్రి, మాలిపురం, వెలిశాల మత్స్య సహకార సంఘాలకు పాలకమండళ్లు లేవు. ఎన్నికలు నిర్వహించాలని త్వరలోనే ప్రతిపాదనలు పంపించనున్నారు. పర్సన్ ఇన్‌ఛార్జి ఉన్న మరో రెండు సంఘాలు పెంచికల్‌దిన్న, మేడారం సంఘాలకు సైతం ఎన్నికలు జరిపించాలని వివరాలను ఎలక్షన్ కమిషన్‌కు ఓటర్ల జాబితాను పంపించనున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ 15 సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాయి. తాళ్లమొల్కాపురం, కోదాడ, రఘునాధపాలెం, నాగయ్యగూడెం, తాడ్వాయి, వేణుగోపాలపురం, వర్ధమానుకోట, సోమారం, చిల్పకుంట్ల, మాచనపల్లి, అన్నారం(ఎన్), రామారం, యండ్లపల్లి, తిర్మలగిరి, తుంగతుర్తి మత్స్య సహకార సంఘాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనుంది.

లీజు వసూలు చేస్తున్నాం



సూర్యాపేట జిల్లాలో రూ.64 లక్షల చెరువుల లీజు రావల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.10 లక్షలు వసూలు అయ్యాయి. మత్స్య సహకార సంఘాలను అడుగుతున్నాం. రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వద్ద 15 సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 19 సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నాం.

బి. నాగుల్, మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట జిల్లా.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512.60
టీఎంసీలు	136.1274
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	5.598
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	64,472 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	6,498 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.66 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	637.30 అడుగులు
టీఎంసీలు	2.63
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	681.82 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	87.65 క్యూసెక్కులు

మినీ శిల్పారామం

కనుమరుగు

● కానరాని గత వైభవం



తులసీ కాటేజీలో మినీ శిల్పారామం

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట): అంతర్జాతీయ ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పల్లె జీవనశైలి ప్రతిబింబించేలా మిని శిల్పారామం నిర్మించారు. క్షణం తీరికలేని ఉరుకులు, పరుగుల ఆధునిక జీవనంలో ఆహ్లాదం, ఆనందం వెల్లివిరిసేలా ఈ శిల్పారామం రూపొందించారు. పూర్వకాలంలో శ్రమజీవుల కష్టాల జీవనం నుంచి కాస్తంత ఊరట పొందేలా ఆటపాటలతో కూడిన మట్టి మనుషుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. కొండకింద తులసీ కాటేజీలో నిర్మించిన ఈ మినీ శిల్పారామం ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు పర్యాటక అనుభూతితో పాటు ఆహ్లాదం, ఆనందం కల్పించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఇక్కడ ఆహ్లాదంకోసం సుమారు రూ.కోటి వెచ్చించి నిర్మించిన శిల్పారామం కాలక్రమేణ కనుమరుగైంది. భక్తుల ఆదరణ ఎంతగా ఉన్నా, ముందు చూపులేని వైటీడీఏ అధికారుల ఆలోచనతో పల్లె సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే తీపి జ్ఞాపకాలు మృగ్యమయ్యేందుకు దారితీసింది. ఎంతో శ్రమ, వ్యయంతో నిర్మించిన శిల్పారామం అంతే సులువుగా ధ్వంసమైంది. 12లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించిన కొలనులో జలవిహారం, హస్తకళలు, చేనేత వస్త్రాలు ప్రత్యేక స్టాళ్లు ఈ శిల్పారామంలో ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి. క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులను ఎంతగా ఆకర్షించినా, ఈ కొలను మీదుగా అదే ప్రదేశం నుంచి కొండపైకి వెళ్లేందుకు రూ.34కోట్లతో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో మిని శిల్పారామం అక్కడి నుంచి తొలగించడం అనివార్యమైంది. కొన్ని రోజులు ఇదే ప్రదేశంలో సత్యదేవుని వ్రతాలు కూడా జరిపించారు. అంతకు ముందు ఇక్కడే భక్తులు వంటలు చేసుకొని పిల్లాపాపలతో సహపంక్తి భోజనాలు చేసి తిరుగు పయనమయ్యేవారు. ఇప్పుడు ఈ ప్రదేశాన్ని పట్టించుకునే నాథుడు లేక పాత వస్తువులు భద్రపర్చే స్టోరేజీ ప్రాంతంగా మిగిలిపోయింది.



పల్లె జీవనం ప్రతిబింబించే మట్టి మనుషుల విగ్రహాలు ధ్వంసమై ఇలా



భద్రపరిచిన పాత వస్తువులు

వానాకాలం సీజన్ పనులు షురూ



మోత్కూరులో జామచెట్లబావి వద్ద పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

మోత్కూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో వానాకాలం సీజన్ పనులు ప్రారంభమయ్యాయి. తొలకరి వర్షాలకే రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. మేలో అడపాదడపా అకాల వర్షాలు కురిశాయి. ఆ వర్షాలకు పలువురు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. మెట్ట పంటలకు కత్తెర చివరి పాదం, రోహిణి, మృగశిర, ఆరుద్ర కార్తెలు బలమైన కార్తెలు. గతంలో రైతులు పంటలు వేయడానికి ముందైనా ఉండాలి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో కత్తెర చివరి పాదం నుంచే వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభమైంది. ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న కొందరు రైతులు మూడు రోజులుగా పత్తి విత్తనాలు విత్తుతున్నారు. కాలం కలిసి వస్తే బలమైన కార్తెలో పంటలు వేసిన వారికి దిగుబడి కూడా ఎక్కువ వస్తుందని నానుడి. ఇప్పుడు కూలీలకు కూలి రేటు కూడా తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు రోజుకు రూ300 ఉంటే, పూర్తిగా విత్తనాలు విత్తే సీజన్ వస్తే రూ .400 నుంచి రూ. 500 కూలి ఉంటుందని రైతులు చెబుతున్నారు. విత్తిన విత్తనాలు బలంగా మొలకెత్తేలా వర్షాలు కురుస్తుండటంతో విత్తనాలు విత్తిన రైతులు సంతోషంగా ఉన్నారు.

విత్తనాల ధర పెంచిన ప్రభుత్వం.. తగ్గించి విక్రయిస్తున్న వ్యాపారులు

వరుసగా నాలుగేళ్లుగా ప్రభుత్వం పత్తి విత్తనాల ధర పెంచుతూనే ఉంది. 2020లో పత్తి విత్తనాల ప్యాకెట్(450గ్రాముల) ధర రూ.730 ఉండగా 2021లో రూ.37పెంచి ప్యాకెట్ ధర రూ.767 చేసింది. 2022లో రూ.43 పెంచి ప్యాకెట్ ధర రూ.810, 2023లో రూ.43 పెంచి ప్యాకెట్ ధర రూ.853, 2024లో రూ.11 పెంచి ప్యాకెట్ ధర 864 చేసింది. ఈ ఏడాది (2025 సీజన్‌కు) రూ.37 పెంచి ప్యాకెట్ ఎమ్మార్పీ రూ.901 చేసింది. పత్తి విత్తన కంపెనీల యాజమాన్యాలు ప్రతి సంవత్సరం వలే ఈ సారి కూడా ప్రభుత్వాన్ని ఒప్పించి ధర పెంచుకోగలిగినప్పటికీ క్షేత్ర స్థాయిలో వారి వ్యూహం బెడిసికొట్టిందని చెబుతున్నారు. సీజన్ ప్రారంభమైనా విత్తనాలు ఆశించిన స్థాయిలో అమ్ముడుపోనందున అటు విత్తన కంపెనీలు, ఇటు వ్యాపారులు పత్తి విత్తనాల ధర ఎమ్మార్పీ కన్నా సుమారు రూ.100 వరకు తగ్గించి విక్రయిస్తున్నారు. పత్తి సాగు విస్తీర్ణం కొంత తగ్గడం. విత్తన కంపెనీల వద్ద విత్తనాల స్టాక్ పుష్కలంగా ఉండటం విత్తనాల రేటు తగ్గడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

రుణాలు ఇప్పిస్తానంటూ ఘరానా మోసం

● వినియోగదారుల ఖాతా నుంచి రూ.22 లక్షలు డ్రా ● వాయిదా డబ్బులు చెల్లించాలని ఫోన్ రావడంతో వెలుగులోకి



శ్రీనయ్యకు ఇచ్చిన రూ.35లక్షల కొటాక్ మహీంద్ర బ్యాంక్ డమ్మీ చెక్కు

డిండి, మే 25 (ఆంధ్రజ్యోతి): రుణాలు ఇప్పిస్తానంటూ ఇద్దరి నుంచి చెక్కులు తీసుకుని వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.22 లక్షల నగదు విత్ డ్రా చేసిన యువకుడి భాగోతం నల్లగొండ జిల్లా డిండి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. డిండి మండలం తవక్లాపూర్ గ్రామపంచాయ తీ పరిధిలోని హజ్యా తండాకు చెందిన ఆంగోతు వెంకటేష్ ఏడో తరగతి చదివాడు. వ్యక్తిగత అవసరాలకు రుణం అవసరమైనవారు సంప్రదిస్తే వారి స్థిరాస్తులు తాకట్టు పెట్టించి శ్రీరామ్ ఫైనాన్స్ నుంచి రుణాలు ఇప్పిస్తూ ఉంటాడు. తవక్లాపూర్‌కు చెందిన భయ్య శ్రీనయ్య తన భూమిలో చేపల చెరువు, కోళ్ల ఫాం పెట్టుకోవడానికి రుణం ఇప్పించాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో వెంకటేష్‌ను ఆశ్రయించాడు. ఇందుకోసం శ్రీనయ్య తన పేరిట ఉన్న డిండి ఆంధ్ర బ్యాంకు 2021లో జారీచేసిన 10చెక్కులు వెంకటేష్‌కు ఇచ్చాడు. అప్పటికే ఆంధ్రాబ్యాంకు యూనియన్ బ్యాంకులో విలీనంకాగా, ఆ చెక్కులు చెల్లవని శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ నిరాకరించింది. దీంతో వెంకటేష్ హైదరాబాద్‌లోని గాయత్రీ బ్యాంక్‌లో శ్రీనయ్య పేరిట ఖాగా తెరిపించి చెక్కు తీసుకున్నాడు. అప్పు ఇప్పించేందుకు శ్రీనయ్య నుంచి రూ.50వేల కమీషన్ తీసుకున్నాడు. తాకట్టు పెట్టిన ఆస్తిపై శ్రీరామ్ ఫైనాన్స్ రూ.18లక్షలు మాత్రమే రుణం ఇస్తుందని, కొటక్ మహీంద్ర బ్యాంక్‌లో ఇదే ఆస్తిపై రూ.35లక్షల వరకు అప్పు ఇప్పించగలనని శ్రీనయ్యను నమ్మించాడు. హైదరాబాద్‌లోని కొటాక్ మహీంద్రబ్యాంక్ చైతన్యపురి బ్రాంచ్ నుంచి జారీ అయిన రూ.35 లక్షల చెక్కును 2025వ సంవత్సరం మే 26వ తేదీన చెల్లుబాటు అయ్యే విధంగా ముందు తేదీలతో చెక్ ఇచ్చాడు. మహీంద్ర బ్యాంక్ నుంచి రుణం మంజూరైందని, త్వరలో మీ ఖాతాలో నగదు జమ అవుతుందని ఓ వ్యక్తితో శ్రీనయ్యకు ఫోన్ చేయించాడు. చెక్కుపై ఇచ్చిన తేదీన నగదు జమ అవుతుందని శ్రీనయ్య ఎదురు చూస్తున్నాడు.

వాయిదా కట్టాలని ఫోన్ రావడంతో వెలుగులోకి

శ్రీరామ్ ఫైనాన్స్ నుంచి తీసుకున్న అప్పుకు వాయిదా (ఈఎంఐ) చెల్లించాలని శ్రీనయ్యకు ఫోన్ రావడంతో తన ఆస్తి పత్రాలు తాకట్టు పెట్టి రూ.17,53,222 రుణం తీసుకున్నట్లు విషయం వెలుగుచూసింది. శ్రీనయ్య ఆస్తిపత్రాలు శ్రీరామ్ ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టటంతో రూ.17,53,222 రుణం తీసుకోగా, సంబంధిత నగదు శ్రీనయ్య పేరిట ఉన్న డిండి యూనియన్ బ్యాంకు ఖాతాలో మార్చి 30వ తేదీన జమ అయినట్లు గుర్తించారు. శ్రీనయ్య వద్ద తీసుకున్న 10ఖాళీచెక్కులను ఉపయోగించి మార్చి 31వ తేదీన యూనియన్ బ్యాంకు కరస్పాండెంట్ సహకారంతో రూ. 15,28,220నగదును వెంకటేష్ తన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు బదలాయించాడు. యూనియన్ బ్యాంకులో శ్రీనయ్య పేరిట కొత్త ఏటీఎం కార్డుకు దరఖాస్తు చేసి పిన్ జనరేట్ చేసుకునేందుకు ఫోన్ తీసుకున్నాడు. అనంతరం ఏటీఎం ద్వారా రూ.25 వేలు, ఫోన్‌పే ద్వారా రూ.2లక్షలు డ్రా చేశాడు.

మరో రైతు ఖాతా నుంచి

వీరబోయినపల్లిగ్రామపంచాయతీలోని శక్రు తండాకు చెందిన యువ రైతు ఖాతా నుంచి ఇదే తరహాలో చెక్కులు ఉపయోగించి రూ.4లక్షలు తన బంధువుల ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు

బాధితులు నిలదీయటంతో

తమ ఖాతాల నుంచి రూ.22లక్షల నగదును ఇతర ఖాతాల్లోకి బదిలీ చేయించటంపై బాధితులు వెంకటేష్‌ను నిలదీయగా, తప్పు చేసినట్లు అంగీకరించి తిరిగి చెల్లించేలా లిఖిత పూర్వకంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకోసం రూ.18లక్షలకు వెంకటేష్‌కు సంబంధించిన ఆస్తిని శ్రీనయ్య సోదరుడికి మార్టిగేజ్ చేయించాడు. యూనియన్ బ్యాంకులో విలీనం కాకముందే ఆంధ్రాబ్యాంకు జారీచేసిన చెక్కులు చెల్లుబాటు కావని స్పష్టమైన ఆదేశాలున్నా బ్యాంక్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నగదు బదిలీ చేయడంపై బాధితులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఖాతాదారుడు ఇచ్చిన చెక్కుతో రూ.2 లక్షలకుపైగా నగదు తీసుకుంటున్న సమయంలో ఇతర వ్యక్తులు వస్తే చెక్కు జారీచేసినవారికి సమాచారం ఇవ్వాల్సి ఉండగా, బ్యాంక్ అధికారులు అలా చేయకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. వెంకటేష్ ఘటనపై శ్రీరామ్ ఫైనాన్స్ ఉద్యోగులు మాట్లాడుతూ తాము ఎవరినీ రికవరీ ఏజెంట్‌గా నియమించుకోలేదని, వెంకటేష్‌కు శ్రీరామ ఫైనాన్స్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ ఘటనపై డిండి ఎస్ఐ రాజును వివరణ కోరగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఈ ఘటనపై బ్యాంక్ మేనేజర్ సురేంద్ర బాబును వివరణ కోరగా వెంకటేష్ తమ బ్యాంకు కరస్పాండెంట్‌తో బ్యాంకుకు వచ్చారని, కుటుంబ సభ్యుల్లో ఒకరు ఆసుపత్రిలో చావు బతుకుల్లో ఉన్నారని చెప్పటంతో బంధువుల ఖాతాలోకి నగదు జమ చేసినట్లు తెలిపారు.

గుట్టకు పోటెత్తిన భక్తులు

● సందడిగా ఆలయ తిరువీధులు, వ్రత మండపాలు
● స్వామి వారిని దర్శించుకున్న 67 వేల మంది భక్తులు

యాదగిరిగుట్ట, మే 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేసవి సెలవులు... వారాంతపు సెలవు ఆదివారం రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు శనివారం రాత్రే అధిక సంఖ్యలో సొంత వాహనాల్లో యాదగిరిగుట్టకు చేరుకున్నారు. కొండ కింద ఆధ్యాత్మిక వాడల్లోని బస్టాండ్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపైన, కింద బస్టాండుల్లో రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో సీట్ల కోసం భక్తుల ఘర్షణలు, తోపులాట కనిపించింది భక్తుల రాకతో కొండపై, కింద పార్కింగ్ పదేశాలు నిండిపోయాయి. కొండకింద వైకుంఠద్వారం ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేశారు. అలాగే కొండకు ఉత్తరం వైపు పార్కింగ్ ప్రదేశం కూడా నిండింది.

ఉదయం నుంచే భక్తుల రద్దీ

ప్రధానాలయం, శివాలయం, కల్యాణ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో కూడా సందడి నెలకొంది. ఉభయ క్యూలైన్ల ద్వారా స్వయంభువులను దర్శించుకున్న భక్తులు ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీపడ్డారు. సుమారు 67 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ఉచిత ధర్మ దర్శన క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు రెండు గంటలు, ధర్మదర్శనాలకు నాలుగు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.74,33,486 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు పరిశీలించారు. కొండపైన ఆలయం మూసిన తర్వాత ఆలయం, ఆలయ పరిసరాలు వేకువజామున 4.30 గంటల లోపు పూర్తి శుభ్రం చేయాలని శానిటేషన్ విభాగం కాంట్రాక్టర్ సూపర్‌వైజర్ ఆదేశించారు. స్వామివారి అభిషేక పూజల్లో పాల్గొని దేవస్థానంలో వసతులు, అద్దె గదులు, ఏర్పాట్లపై భక్తులను ఆరా తీశారు.



ప్రత్యేక దర్శనానికి వెళ్లే దారిలో భక్తుల సందడి

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవార్లకు నిత్య పూజలు చేపట్టారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.



ప్రాకార మండపంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా మట్టపల్లి లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని ఆదివారం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం మాంగళ్యధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజష్, రమేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

డిగ్రీ పరీక్షల్లో 27 మంది విద్యార్థుల డిబార్

నల్లగొండ, మే 25 (ఆంధజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో ఆదివారం మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన 27మంది విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు జరిగిన రెండో సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,145 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,363 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలో 16 మంది విద్యార్థులు డిబారయ్యారు.నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం మాల్‌లో 9మంది, దేవరకొండలో 4, మిర్యాలగూడలో ఒకరు, భు వనగిరిలో ఒకరు, రామన్నపేటలో ఒక్కరు చొప్పున డిబారయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 2,152 మందికి గాను 1,898 హాజరుయ్యారు. ఇందులో 11మంది విద్యార్థులను డిబార్ చేశారు. నల్లగొండలో 8 మంది, భువనగిరిలో ఒకరు, కోదాడ, మిర్యాలగూడలో ఒకరి చొప్పున డిబారయ్యారు.

సాగర్‌ను సందర్శించిన జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి



బుద్ధుడి పాదాలకు వందనం చేస్తున్న సంపూర్ణ ఆనంద్‌కుమార్

నాగార్జునసాగర్,మే25(ఆంధ్రజ్యోతి):ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను ఆదివారం జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి సముద్రాల సంపూర్ణ ఆనంద్‌కుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. బుద్ధవనానికి చేరుకున్న ఆయనకు బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర ఘన స్వాగతం పలికారు బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించిన అనంతరం జడ్జి దంపతులు మహాస్థూపం లోపల ధ్యాన మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బుద్ధవనం సమావేశ మందిరంలో బుద్ధవనం డాక్యుమెంటరీని వీక్షించారు. బుద్ధవనంలో చరిత వనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపాలను తిలకించారు. బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. అనంతరం ప్రధాన డ్యాం, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను తిలకించారు. వారి వెంట సాగర్ ఎస్ఐ సంపత్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, కోర్టు సిబ్బంది నరేష్, శివ, కిషన్ తదితరులు ఉన్నారు.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో



కేతేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ నదీ పరీవాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 637.30 అడుగులకు చేరింది. నెల రోజులకు పైగా ఐదారు వందల క్యూసెక్కులుగా నిలకడగా ఉంటున్న ఇన్‌ఫ్లో శనివారం 1,225 క్యూసెక్కులుగా నమోదైంది. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతో పాటు ఎగువ మూసీ పరీవాహక గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు క్రమంగా దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుంది. దీంతో 645 అడుగులు (4.46 టీఎంసీలు) పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 637.30 అడుగులకు (2.63 టీఎంసీలు) చేరింది. వేసవిలోనే ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టు గ్రామాల రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వచ్చే 4,5 రోజులు ఇన్‌ఫ్లో ఇదే రీతి లో కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం 640 అడుగులకు చేరడం ఖాయమని మూసీ యంత్రాంగం పేర్కొంటుంది. ఇప్పటికే జలకళను సంతరించుకున్న ప్రాజెక్టు ఖరీఫ్ సీజన్ ఆరంభంలో రుతుపవనాల ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలకు నిండి వానాకాలం సాగుకు నీరు అందుతుందని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయంపై సమీక్షలతోనే సరి!

(5వ పేజీ తరువాయి)

సీజన్‌లో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు.

పెట్టుబడులకు వడ్డీ వ్యాపారులే దిక్కు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 11లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.50లక్షల మంది, సూర్యాపేట జిల్లాలో 3.50లక్షల మంది, యాదాద్రి జిల్లాలో 2.10లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 21లక్షల ఎకరాల వరకు సాగుభూమి ఉంది. ప్రభుత్వం రైతుభరోసాను నాలుగు ఎకరాల వరకే ఇచ్చి మిగతా రైతులకు భరోసా కల్పించకపోవడంతో వారు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. యాసంగి వ్యవసాయ సీజన్ ముగిసి వానాకాలం సీజన్ సమీపించగా, ఇప్పటి వరకు ప్రభుత్వం అందరి రైతులకు పెట్టుబడిని అందించలేకపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఎంత భూమి ఉన్నా ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుబంధు కింద అందించే వారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.7500 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. అయితే ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎకరానికి రూ.6వేల చొప్పున ఏటా రూ.12వేలు నిర్ణయించి నాలుగు ఎకరాలు ఉన్న రైతులకు ఎకరానికి రూ.6వేల చొప్పున జమచేసింది. ప్రస్తుతం పంటల సాగుకు చేతిలో డబ్బు లేక రైతులు అప్పులు చేస్తున్నారు. ఎకరానికి రూ.25వేల చొప్పున పెట్టుబడి వస్తోంది. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి డబ్బు తెచ్చిన రైతులు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. కాంగ్రెస్ అదనంగా ఎకరాకు రూ.2,500 మొత్తం రూ.7,500ఎకరానికి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడంతో రైతులు ఆశపడగా, తీరా ప్రభుత్వం ఎకరానికి రూ.6వేలు ఇస్తూ నిర్ణయం చేయడంతో నిరుత్సానికి గురవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ రైతుకు ఎంత భూమి ఉన్నా 11సార్లు రైతుబంధును అమలు చేసింది. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రతీ సీజన్‌లో రూ.1,450కోట్లకు పైగా రైతుబంధు వచ్చేది. ప్రస్తుతం 11లక్షల మందికి పైగా రైతులకు గతంలో మాదిరిగా అమలు చేస్తే ఎకరాకు రూ.6వేల చొప్పున ఏటా రెండు సీజన్లలో ఎకరాకు రూ.12వేలు చెల్లిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తక్కువ భూమికే రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేదంటే గతంలో చెప్పిన విధంగా సేద్యం చేస్తున్న భూమి అంతటికీ రైతుభరోసా కల్పిస్తారా? అనేది వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే పథకాల అమలు

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రైతుభరోసాతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు నిర్వహించిన అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. యాంత్రీకరణ పథకానికి దరఖాస్తులు కూడా తీసుకున్నాం. త్వరలోనే ఈ పథకాన్ని అమలు చేస్తాం. రైతుభరోసా ఇప్పటికే నాలుగు ఎకరాల వరకు రైతులకు పెట్టుబడి సాయం అందించాం.

-పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

టీఆర్‌జీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనునాయక్

మిర్యాలగూడ అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం(టీఆర్‌జీఎస్) ఉమ్మడిజిల్లా అధ్యక్షుడిగా ధీరావత్ శ్రీనునాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా పలు జిల్లాల అధ్యక్షులను నియమించారు. అందులో భాగంగా శ్రీనునాయక్‌ను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మిర్యాలగూడలో మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడతామన్నారు. 10శాతం రిజర్వేషన్ల సాధనతోపాటు గిరిజనుల గోర్‌బోలి భాషను జాతీయ భాషగా గుర్తించేందుకు ప్రభు త్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. గిరిజనుల సమస్యలపై చేపట్టే భవిష్యత్తు ఉద్యమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కాగా, శ్రీనునాయక్ నియామకం పట్ల కుర్ర శంకర్‌నాయక్, వెంకన్న నాయక్, జవహర్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు.



నియామకపత్రాన్ని అందుకుంటున్న శ్రీనునాయక్

వక్ఫ్ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

నల్లగొండ, నార్కట్‌పల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ముస్లింల పర్సనల్ బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో మానవహారం నిర్వహించారు. వక్ఫ్ బచావో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, భారత్ జిందాబాద్ అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. వక్ఫ్ బిల్లు చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆదివారం నార్కట్‌పల్లిలో ముస్లింలు స్థానిక మజీద్ ఎదురుగా మానవహారంతో నిరసన తెలిపారు. వక్ఫ్ బోర్డు బిల్లులో చట్ట సవరణలు తేవడం విచారకరమన్నారు.

చరిత్రకు సాక్ష్యం



- చెక్కుచెదరని నిజాం కాలంనాటి వంతెన
- వందేళ్ల క్రితం నాటి నిర్మాణం
- దశాబ్దాల పాటు రెండు ప్రాంతాలకు వారధి
- ఆదరణ లేక దెబ్బతింటున్న చారిత్రక కట్టడం



చెక్కుచెదరకుండా ఉన్న నిజాం కాలం నాటి వంతెన

నిజాం కాలంలో నిర్మించిన రాతి వంతెన అది.దాదాపు వందేళ్లు గడిచినా ఇప్పటికీ అది చెక్కు చెదరలేదు. రాతి గచ్చుతో నిర్మించిన ఈ వంతెనలో ఎక్కడా చిన్న గచ్చు ముక్క కూడా నేటికీ ఊడిపోలేదు. పది దశాబ్దాలకు పైగా నాటి నైజాం- ఆంధ్రా, నేటి తెలంగాణ - ఆంధ్రప్రదేశ్‌ల మధ్య రాకపోకలకు వారిధిగా నిలిచి నేడు పాలకుల నిరాదరణతో కుంగిపోతుంది. స్వల్ప మరమ్మతులు చేస్తే మరింతకాలం పటిష్టంగా ఉండనుంది.

– (ఆంధ్రజ్యోతి,కేతేపల్లి)

బ్రిటీష్ పాలనలో ఉన్న విజయవాడకు, నైజాం పాలనలో రాజధానిగా ఉన్న హైదరాబాద్ నగరానికి మధ్య ఓ చిన్న కాలిబాట (రాచబాట)గా ఉన్న దారి ఆ తర్వాత దండుబాటగా రూపాంతరం చెందింది. నైజాం, బ్రిటీష్ సైన్యాలు రెండు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుండటంతో దీనికి దండుబాటగా పేరు వచ్చింది. దండుబాట మీదుగా సైన్యం రాకపోకలు సాగించే క్రమంలో కేతేపల్లి మండల శివారులోని మూసీ నది దాటడం కష్టంగా మారింది. దీంతో మూసీ నదిపై నేటి కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామాల మధ్య సింగిల్‌లేన్‌లో ఓ చక్కటి రాతి కట్టడంతో వంతెన నిర్మించారు. కాలక్రమంలో బ్రిటీష్ పాలనలోని ఆంధ్రా, నైజాం పాలనలోని హైదరాబాద్‌లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా మారాయి. దీంతో రెండు ప్రాంతాలకు ప్రజల రాకపోకలు పెరిగి సింగిల్ లేన్‌తో ఉన్న రహదారి సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో మూసీ నదిపై సింగిల్‌లేన్‌గా నిజాం కాలంలో నిర్మితమైన వంతెన విస్తరణ అనివార్యమైంది. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డబుల్‌లేన్‌గా మార్చారు. అప్పటి అవసరాల మేరకు దండుబాటగా ఉన్న ఈ రోడ్డుకు మహర్దశ పట్టింది. ఈ నేపథ్యంలో సింగిల్‌లేన్‌గా ఉన్న రహదారికి సమాంతరంగా మరో వంతెన నిర్మించడంతో రెండులేన్లుగా మారి 9 నెంబరు జాతీయ రహదారిగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత దాదాపు 75 ఏళ్ల పాటు సేవలు అందించిన తర్వాత 14 ఏళ్ల క్రితం ఈ రహదారిని విస్తరించడంతో అప్పటి వరకూ 9వ నెంబరు జాతీయ రహదారిగా పేరొందిన ఈ రహదారి నాలుగు లేన్లతో 65వ నెంబరు జాతీయ రహదారిగా రూపాంతరం చెందింది. రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించే క్రమంలో మూసీ నదిపై వందేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన పక్కనే ఒక్కో వంతెనపై రెండు లేన్ల రహదారితో మరో రెండు నూతన వంతెనలు నిర్మించారు. దీంతో ప్రస్తుతం పురాతన వంతెన నిరుపయోగంగా మారి, స్థానిక అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతుంది.

నిర్మాణ శైలి వల్లే పటిష్టం...

చక్కటి ఆకృతిలో చేసిన బలమైన రాతి స్తంభాలు ఒకదానికి ఒకటి గచ్చుతో అతికించి అర్ధచంద్రాకారంలో ఉండే 18 ఖానాల (వెంట్)తో ఈ వంతెన నిర్మితమైంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ వంతెన ఖానాలు నేటికీ కనీసం బీటలు కూడా పట్టలేదు. అర్ధచంద్రాకారంలో నిర్మించిన ఈ వంతెనలోని ఖానాల మధ్యలో బలమైన ఓ రాయి కనిపిస్తుంది. పూర్తిగా ఆ ఖానా భారమంతా ఆ రాయిపైనే ఉంటుందని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. ఆ రాయి పడిపోతే వంతెన కూలుతుంది. కానీ వందేళ్లకు పైగా ఎన్నెన్నో భారీ వాహనాలు పరుగులు తీసినా నాణ్యతలో ఏమాత్రం తేడా లేకపోవడం నాటి పనితీరుకు దర్పణం పడుతుంది. ఈ కాలంలో సిమెంట్ కాంక్రీటుతో నిర్మించే వంతెనలు నిర్మిస్తుండగానే బీటలు పడుతున్నాయి. రెండు ప్రాంతాల మధ్య వారధిగా ఉన్న పురాతన కాలంనాటి ఈ వంతెనను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.



న్యూస్ బాక్స్



ఆలయంలో ఎస్ఐ దంపతుల పూజలు

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కనగల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి దంపతులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎస్ఐ దంపతులకు వేద ఆశీర్వచనాలను తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతేకాక వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చీరసారె ఒడి బియ్యం బోనసైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

గట్టుప్పల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పార్లమెంటులో చట్టం చేయాలని రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మునుకు బుచ్చిరెడ్డి, చాపల మారయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్పు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గ హక్కులను కాలరాస్తోందని, వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తామని అన్నారు.

గుండెపోటుతో గురుస్వామి సోమయ్య మృతి



సోమయ్య (ఫైల్‌ఫొటో)

శాలిగౌరారం, మే 25 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి, గ్రామ శివాలయ ఆలయ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అక్కినేపల్లి సోమయ్య (53) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోమయ్య అకాల మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ సోమయ్య మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం, మే 25(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామంలో పేద కుటుంబానికి చెందిన ఉట్కూర్ యాకోబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గర్ధాస్ లింగయ్య, మాజీ సర్పంచ్ మాతంగి శ్రీనివాస్‌లు కలిసి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన మాగి రవి, వంగూరి శ్రీనివాస్, నక్క నరేష్, మొలుగురి వెంకన్న, వంగూరి మల్సూర్, మొలుగురి జోష్, వంగపల్లి శ్రీరాములు, ఇజ్రాయిల్ కలిసి రూ.6300 అందజేశారు. పెర్కకొండారం గ్రామానికి చెందిన హిమబిందు ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి నాగరాజు 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు దేవరకొండ సైదులు, రాచకొండ గణేష్, మాగి రవి, గద్దపాటి రమేష్ పాల్గొన్నారు.

బోరు మోటార్ ఏర్పాటు

కనగల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మగూడెం గ్రామ పంచాయతీ కుమ్మరిగూడెం గ్రామంలో మంత్రి కోమటిరెడ్డి ఆదేశాల మేరకు మంచినీటి బోరుకు ఆదివారం కొత్త మోటారు ఏర్పాటు చేశారు. గ్రామంలో బోర్ మోటార్ కాలిపోయి ప్రజలు కొద్ది రోజులుగా మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ కొత్త మోటార్‌ను కొనుగోలు చేసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పగిడిటిపాటి సత్తయ్యకు అందజేశారు. ఆదివారం ఆయన గ్రామస్థుల సహకారంతో బోరుకు మోటార్‌ను బిగించి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ యాదయ్య, నాయకులు మండలి పరమేష్, మాచర్ల పాపయ్య, కొండ సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

చిట్యాలరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం తాళ్లవెల్లంలలోని ఆ ర్గానిక్ శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం ప్రధాన ద్వారం సమీపంలో నిలువెత్తు వీ రాంజనేయస్వామి విగ్రహం, లోపల వినాయక, సరస్వతిదేవీ, సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహాలను శాస్త్రోంగా బ్రాహ్మణులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు పామనగుళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్గానిక్ శ్రీ కృష్ణమందిరంలో శ్రీకృష్ణుడి విగ్రహమే కాకుండా దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని నిర్ణయించామని, శుభముహూర్తంలో విగ్రహాలను సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించిన ట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవకులు కల్యాణ్‌చౌదరి, అమర్‌నాథ్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డి, నాగ్‌కిరణ్, రఘుబాబు, హరికుమార్ రెడ్డి, సందదీప్ రెడ్డి, జలంధర్, ఇంద్రారెడ్డి, భక్తులు తదితరు లు పాల్గొన్నారు.



వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

బెండల్‌పహాడ్‌లో నాభిశిల ప్రతిష్ఠాపన



బొడ్రాయి ప్రతిష్ట పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బెండల్‌పహాడ్‌లో ఆదివారం నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపనోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటికీ వచ్చిన ఆడపడుచులు, బంధువుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ పూజల మధ్య ఉదయం నాభిశిల ప్రతిష్ఠ అనంతరం గ్రామస్థులంతా నాభిశిలకు జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామశివారులో ఉన్న గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తితో బోనాలు సమర్పించారు. ఈ వేడుకకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి, మల్ల బాలకృష్ణ, యానాల కృష్ణారెడ్డి, ఎడమ శేఖర్ రెడ్డి, తొడుసు నర్సింహ, వంగాల రాందాసు, లొడంగి శ్రీనివాస్, కందాల వెంకట్‌రెడ్డి, పైళ్ల శశిధర్‌రెడ్డి, సైదిరెడ్డి, బిక్షంరెడ్డి, నంద్యాల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల మహాసభను జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మర్రిగూడ, మే 25(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రంలో జూన్ 6 జరగనున్న సీపీఐ మండల 15వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీపీఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షంరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పార్టీ నిరంతరం పాటుపడుతుందని అన్నారు. ఈ మహాసభను సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొననున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సీపీఐ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్, కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్, ఎరకల నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించాలి

నల్లగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను పాఠశాల దశ నుంచే క్రీడల్లో ప్రోత్సహించాలని టూటౌన్ ఎస్ఐ సైదులు అన్నారు. జిల్లా కేంద్రంలో తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రోత్సహించడం వల్ల క్రమశిక్షణ, మనోవికాసం, ధైర్యం పెరుగుతుందని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. తైక్వాండో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల రమేష్ ఆ ధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు ఈద భాస్కర్, అనిల్‌కుమార్, రాజా, ప్రశాంత్, పూర్ణచందర్, కరుణాకర్, శివరాం, మనోజ్, నరేందర్, వర్తిక, పృథ్వి, రజింత్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాదారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి

శాలిగౌరారం, మే 25 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారం జడ్పీ హైస్కూల్‌లో 1996-97 ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ నివాసి ఆ సమయంలో ఉపాధ్యాయులుగా పనిచేసిన ఇప్పటి నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 25 సంవత్సరాల తర్వాత విద్యార్థులు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు అప్యాయతగా పలకరించుకొని తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనంతుల సత్యనారాయణగౌడ్, పొట్టబత్తుల పార్థసారధి, వేముల సైదులు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని నక్కలపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2012-13 విద్యాసంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి తరగతి గదుల జ్ఞాపకాలను విద్యార్థులు నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేసిన ఆనాటి ఉపాధ్యాయులు కుకుడాల గోవర్ధన్, విజయ్‌పాల్, పాండరీ, కృష్ణ, అలీం, రమేశ్‌కుమార్, ఆదినారాయణ, రామలింగయ్య, జయారపు రమేష్, విద్యావలంటీర్ భాషపాక రవికుమార్, శ్రీపతి యాదయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంచర్ల విజయ్‌కుమార్‌రెడ్డి, మైలవరం వసంత, ఈరటి విజయలక్ష్మి, గద్దపాటి తిరుమలేష్, నవీన్, సాయికృష్ణ, సందీప్, శ్రీకాంత్, నవీన్, రేణుక, సౌందర్య, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో నక్కలపల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

వైభవంగా గురుద్వార్ సాహిబ్ ప్రారంభం



గురుద్వార్‌లో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల, మే 25(ఆంధ్రజ్యోతి): చిట్యాలలో నూతనంగా నిర్మించిన గురుద్వార్ సాహిబ్ (సిక్కు మత దేవాలయం)ను ఆదివారం వైభవంగా ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుద్వార్‌లో సిక్కు మత 6వ గురువు గురు హరిగోవింద్ సా హిబ్‌జీ గురుపీఠ బ్రహ్మోత్సవాన్ని చేపట్టారు. ఆదిగ్రంథ్ అఖండ పారాయణం చేశారు. రాగిజద్దా వారితో గురుబాణి, శబద్ కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గురు కాలంగర్ (అన్నదానం) చేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, నాయకులు పోకల దేవదాస్, గురుద్వార్ నిర్వాహకులు సంత్‌సింగ్, దిలీప్‌సింగ్, కిర్పాల్‌సింగ్, అంగద్‌సింగ్, ధర్మేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలమ్మ చెరువు ఆక్రమణలను తొలగించాలి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి, మే 25 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రం కేతేపల్లిలోని నిమ్మలమ్మ చెరువు ఆక్రమణలను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కట్టంగూరు మండలంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో పలువురు నాయకులు కలిశారు. పట్టా భూముల పేరిట కేతేపల్లి నిమ్మలమ్మ చెరువులో రెండేళ్ల క్రితం జరిగిన ఆక్రమణలను విడిపించాలని వినతిపత్రం అందించారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిమ్మలమ్మ చెరువులో 80 శాతం మేర రైతులకు పట్టా భూములు ఉన్నా ఒకరిద్దరు రైతులు మాత్రమే చెరువును వేల ట్రిప్పుల మట్టితో పూడ్చి నీటి నిల్వ సామర్థ్యాన్ని దెబ్బతీశారని విన్నవించారు. మట్టితో పూడ్చటంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయి స్థానికంగా తాగు, సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బీరం జానిరెడ్డి, ఎం.కరుణాకర్‌రెడ్డి, మట్టి సాల్మన్, డి.సంపత్ తదితరులు ఉన్నారు.

చిట్యాలలో అండర్‌పాస్‌లు నిరించాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


చిట్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిధిలో మరో రెండు అండర్‌పాస్‌లు నిర్మించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశంను అఖిలపక్ష నాయకులు ఆదివారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అండర్‌పాస్‌లు లేకపోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను విన్న కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, నారబోయిన శ్రీనివాస్, గుండాల నరేష్‌గౌడ్, మాస శ్రీనివాస్, రుద్రవరం లింగస్వామి, ఆగు అశోక్, ఏర్పుల పరమేష్, ఎద్దులపురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానమే సమాజ మార్పునకు నాంది : కేవీపీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నకిరేకల్, మే 25 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానమే సమాజ మార్పునకు దోహదపడుతుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. నకిరేకల్ కేవీపీఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్టంగూరులో జూన్ 22, 23 తేదీల్లో నిర్వహించే కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ శిబిరాలకు 200 మంది పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వంటెపాక కృష్ణ, రామస్వామి, వెంకన్న, వెంకటయ్య పాల్గొన్నారు.



మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో 7
డిగ్రీ పరీక్షల్లో 27 మంది విద్యార్థుల డిబార్

ఆంధ్రజ్యోతి ఫోకస్

రహదారుల విస్తరణలో జాప్యం



రహదారి దుస్థితి



పిట్టంపల్లి-నల్లగొండ రోడ్డు

- అత్యవసర పనులకు మోక్షం కరువు
- భారీగా రోడ్ల పనులు చేపట్టినా బిల్లుల జాప్యంతో నత్తనడకన
- దశాబ్దాలుగా మరమ్మతులకు నోచని రోడ్లపై దృష్టి పెట్టాలంటున్న స్థానికులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రహదారుల పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. భారీగా రోడ్ల విస్తరణ, మరమ్మతుల పనులు చేపట్టగా, పనుల ఆలస్యంగా కారణంగా ఆయా ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సమీపిస్తుండడంతో రోడ్ల విస్తరణతోపాటు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, లేదంటే వానాకాలంలో ఇబ్బందులు తప్పని స్థానికులు వాపోతున్నారు. మరమ్మతుల నిమిత్తం ఇప్పటికే అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించినా, ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోవడంతో ప్రతిపాదనలు సమర్పించడం లేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40కి పైగా రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటికితోడు వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 500 కిలోమీటర్ల పైచిలుకు రోడ్లకు ప్యాచ్‌లు చేయాల్సి ఉంది. వీటన్నింటినీ తక్షణం చేపట్టేందుకు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

నల్లగొండ జిల్లాలో నాలుగులేన్ల రోడ్ల విస్తరణ పనులకు 20 రహదారులను ఎంపికచేశారు. ఈ పనులన్నీ ప్రారంభమై ఏడాది దాటుతుండగా, బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా పనులు వేగంగా సాగడం లేదు. సుమారు రూ.400కోట్ల అంచనావ్యయంతో చేపట్టిన ఈ రోడ్లు పూర్తయితే దాదాపు 397కిలోమీట ర్ల మేర ప్రధాన రహదారి సదుపాయం కలుగుతుంది. కీలకమైన ముషంపల్లి-కన్నెకల్ రోడ్డు, దేవరకొండ పట్టణంలోని రోడ్లు, చండూరు(బంగారిగడ్డ)-నాంపల్లి-కొండమల్లేపల్లి, వంటి ప్రధాన రోడ్లు ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు కీలకమైన యాదాద్రి పవర్‌స్టేషన్‌ను అనుసంధానించే దామరచర్ల-వీర్లపాలెం ప్రధాన రహదారిని సైతం నాలుగులేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదించినా పనులు ప్రారంభం కాలేదు.



దెబ్బతిన్న కాసనగూడ రహదారి

▸ జిల్లాలో గత వానాకాలంలో గుంతలుపడ్డ 59కిలోమీటర్ల రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రతిపాదించినా, ఇంకా నిధులు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఈ నెలలో పనులు చేపట్టే అవకాశం ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

▸ నార్కట్‌పల్లి మండల కేంద్రంలో పూర్వజాతీయరహదారి విస్తరణ పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు రూ.16కోట్లతో చేపట్టారు. ఈ రోడ్డు అసంపూర్తిగా మిగిలింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం పూర్తిచేయకపోవడంతో వర్షాకాలం లో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద వర్షపునీరు నిలిచి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. రెండు జాతీయరహదారుల జంక్షన్ అయిన నార్కట్‌పల్లిలో ఈ పరిస్థితి నెలకొనడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▸ దేవరకొండ పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి మండలంలోని చెన్నారం వరకు 7కిలోమీటర్ల రోడ్డును రూ.6.40కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టారు. ఈ పనులు 40శాతమే పూర్తయ్యాయి.

▸ డిండి మండల కేంద్రం నుంచి దేవరకొండకు వెళ్లే ప్రధాన రహదారి 3కిలోమీటర్ల మేర గుంతలమయంగా మారింది. నూతన నిర్మాణానికి శిలాఫలకం వేసినా పనులు ప్రారంభం కాలేదు.

▸ చెరుకుపల్లి-తవక్లాపూర్ రోడ్డు నుంచి గ్యాదరాల తండా వెళ్లే రోడ్డుకు, కందుకూరు-దేవరకొండ రోడ్డు నుంచి శాంతిగూడెం-ఎల్లరెడ్డిబాయి వరకు, వావిల్‌కోల్-బ్రాహ్మణపల్లి, దేవరకొండ-డిండి రోడ్డు నుంచి రాస్యాతండాకు వెళ్లే రహదారి, దేవరకొండ-డిండి రోడ్డు నుంచి బొగ్గులదొన వరకు వెళ్లే రోడ్డు, దేవరకొండ-డిండి రోడ్డునుంచి ఢాక్యతండాకు వెళ్లే రోడ్లకు కంకరపరచి ఏడాది గడుస్తున్నా తారు వేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

▸ చింతపల్లి మండలంలోని సాయిరెడ్డిగూడెం-రాయన్నగూడెం-కురవంపల్లి-కిష్టరాయన్‌పల్లి వరకు ఉన్న 5కిలోమీటర్ల రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది.

▸ చందంపేట మండల కేంద్రం నుంచి దేవరచర్ల వరకు రోడ్డు నిర్మాణం నిమిత్తం పాతరోడ్డును పూర్తిగా తవ్వేశారు. ఇక్కడ కొత్త రోడ్డు వేయకపోవడంతో ఈ గుంతల రోడ్డుమీద ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు.

▸ దేవరకొండ మీనాక్షి సెంటర్ నుంచి మైనంపల్లి వరకు 4.400కిలోమీటర్ల నాలుగులేన్ల రహదారి విస్తరణకు రూ.14కోట్ల వ్యయంతో పనులకు ఏడాది క్రితం మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇటీవలి వరకు ఈ పనులు ప్రారంభించలేదు. గతం వారం పనులు ప్రారంభం మవడంతో త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

▸ దామరచర్ల మండల కేంద్రం నుంచి వీర్లపాలెం వరకు 13కిలోమీటర్ల రోడ్డు పలు చోట్ల గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ మీదుగా వెళ్తుండడంతో నాలుగులేన్లుగా మార్చింది. కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

▸ వీర్లపాలెం-కాల్వకట్ట (ఉల్సాయిపాలెం) మధ్య 4కిలోమీటర్ల రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చేందుకు పనులు చేపట్టారు. అయితే రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

▸ వేములపల్లి మండలం సల్కునూరు నుంచి మాడుగులపల్లి-సీత్యాతండా వరకు వెళ్లే రోడ్డు నులు రూ.1.90కోట్లతో చేపట్టారు. అయితే కంకరవేసి వదిలేయడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

▸ జడ్చర్ల-కోదాడ జాతీయరహదారిపై అంగడిపేట ఎక్స్ రోడ్డు నుంచి పీఏపల్లి మండల కేంద్రానికి వెళ్లే డబుల్‌రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈరోడ్డును 20 ఏళ్ల క్రితం ఏర్పాటుచేయగా, ఆ తర్వాత అడపాదడపా మరమ్మతులే తప్ప పూర్తిస్థాయిలో పునర్నిర్మాణం చేయలేదు.సుమారు 5 కిలోమీటర్లు ఉండే ఈ రోడ్డుని విస్తరించాలని, పూర్తి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎస్ఎల్‌బీసీ పనులను మేమే పూర్తి చేస్తాం

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి

కట్టంగూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగమార్గం పనులను తమ హయాంలోనే పూర్తిచేస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయిటిపాముల వద్ద రూ.100కోట్లతో చేపడుతున్న ఎత్తిపోతల పథకం పనులపై నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన శనివారం రాత్రి సమీక్షించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం వెళ్తున్న 44కి.మీ భూమికి ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే నిర్వహించేందుకు డెన్మార్క్ నుంచి హెలికాప్టర్ తెప్పించి లైడార్ సర్వే చేయించనున్నట్లు తెలిపారు. అత్యంత ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి టన్నెల్ మిగతా పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేస్తామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కృష్ణా, గోదావరి జలాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులతో పాటు రాష్ట్రానికి చెందిన రైతాంగానికి నష్టం జరిగిందన్నారు. కృష్ణా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల నీటిని కేటాయిస్తే 512 టీఎంసీలు ఆంధ్రకు, 299 టీఎంసీల నీరు తెలంగాణకు సరిపోతుందని రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. కానీ, తాము అధికారంలోకి వచ్చాక కృష్ణా జలాల్లో వాటాను 70శాతం వరకు తెలంగాణకు కేటాయించాలనే వాదనను బచావత్ ట్రిబ్యునల్ ముందు ఉంచడంతో పాటు గతంలో ఇచ్చిన తీర్పును రీఓపెన్ చేయించినట్లు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా పనులు చేయిస్తున్నామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోకి వచ్చే గంధమల్ల ఎత్తిపోతల భూ సేకరణ సమస్యను దృష్టిలో ఉంచుకుని సామర్థ్యాన్ని తగ్గించి పనులు ప్రారంభించేలా ఆదేశించినట్లు తెలిపారు.

బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు రూ.500కోట్లు కేటాయించామని, పనుల వేగవంతానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, అయిటిపాముల ఎత్తిపోతల పథకాన్ని ఆసిఫ్‌నగర్ నుంచి అనుసంధానించి డిసెంబరు లోపు సాగు నీరు అందించాలని కోరారు. అయిటిపాములతో పాటు బస్వాపురం, గంధమల్ల ద్వారా సాగునీరు అందిస్తే 50,000 ఎకరాలకు నీరు అందుతుందని, అలాగే బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వను పూర్తిచేసి ఎత్తిపోతల ద్వారా నీరందిస్తే నకిరేకల్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఐబీ సీఈ అజయ్‌కుమార్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై సమీక్షలతోనే సరి!



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగంపై సమీక్షలతోనే సరిపెడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీజన్లు వచ్చిపోతున్నా రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు దక్కడం లేదు. రైతుభరోసాతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై స్పష్టత కరువైంది. సీఎం రేవంత్‌రెడ్డి వారం క్రితం మంత్రులు, అధికారులతో వ్యవసాయరంగంపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 23 నుంచి రైతు భరోసా సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించినా, ఇప్పటి వరకు ట్రెజరీల నుంచి నిధులు విడుదల కాలేదు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

- రైతులకు దక్కని సంక్షేమం, అభివృద్ధి పథకాలు
- రైతు భరోసాపై స్పష్టత కరువు
- యాసంగిలో ఇచ్చిన పెట్టుబడి సాయం నామమాత్రమే
- వానాకాలం సీజన్ ముంచుకొస్తున్నా కలగని ఊరట

రైతు భరోసాను గత మార్చి నెలలోనే పూర్తిస్థాయిలో ఇస్తామని పలుమార్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు. గత మార్చి నెలలో నాలుగు ఎకరాలలోపు రైతులకు మినహా ఆపైగా భూమి ఉన్న రైతులకు రైతుభరోసా అందలేదు. ఈ ఏడాది జనవరి 26న ప్రభుత్వం లాంచనంగా, పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 గ్రామాలను ఎంపిక చేసి నూటికి నూరుశాతం ఆయా గ్రామాల్లో రైతుభరోసాను అమలు చేసింది. ఆ గ్రామాల్లో ఎంత భూమి ఉన్నా రైతులకు పూర్తి స్థాయి భరోసా సొమ్మును విడుదలచేసింది. ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ఎకరాల వరకు రైతులకు రైతుభరోసాను అమలు చేశారు.

రైతుభరోసా ఎన్ని ఎకరాలకో?

రైతుభరోసా ఎన్ని ఎకరాల వరకు ఇస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. సాగు చేస్తున్న భూమి మొత్తానికి రైతుభరోసా ఇస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ప్రతీ రైతు రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నారు. ఆ తరువాత ప్రభుత్వం రైతుభరోసాపై ఉమ్మడి జిల్లాల స్థాయిలో సహకారసంఘాలకు చెందిన రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలనే దానిపై అభిప్రాయాలు సేకరించిన ప్రభుత్వం ఆ ఫైల్‌ను ఆటకెక్కించింది. అభిప్రాయాలను తీసుకున్న తరువాత అసెంబ్లీలో చర్చపెట్టి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, తీరా అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టింది. రైతుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం జనవరి 26న రైతుభరోసా ప్రక్రియ ప్రారంభించినా, పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో వ్యవసాయ.

- మిగతా 7వ పేజీలో...

యాంత్రీకరణ నిధులు రూ.3.60కోట్లు ఫ్రీజింగ్

ఈ ఏడాది మార్చి నెలలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి దరఖాస్తులు తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడేళ్లపాటు యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత యాంత్రీకరణపై దృష్టి సారించి దరఖాస్తులు తీసుకుంది. ప్రస్తుతం దరఖాస్తులతోనే సరిపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.3.60కోట్లు కేటాయించింది. యాదాద్రి జిల్లాకు 240 పరికరాలకు రూ.72లక్షలు, సూర్యాపేట జిల్లాకు 457 పరికరాలకు రూ.1కోటి, నల్లగొండ జిల్లాకు 820 యాంత్రీకరణ పథకాలకు రూ.1.88కోట్లను ప్రకటించారు. అయితే ఈ నిధులను ట్రెజరీకి విడుదల చేసి పరికరాలను కొనుగోలు చేయాల్సి ఉండగా, ట్రెజరీలోనే నిధులను ఫ్రీజింగ్ చేశారు. మళ్లీ ఈ ఏడాది కొత్తగా యాంత్రీకరణకు నిధులు కేటాయించి, గతంలో కేటాయించిన నిధులను విడుదల చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పట్లో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలయ్యే అవకాశాలు కన్పించడం లేదు.





పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రశాంతంగా గ్రామ పాలనాధికారుల పరీక్ష

నల్లగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష ప్రారంభమైన వెంటనే కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు, గైర్హాజరైన వారి వివరాలు, కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, బందోబస్తును పరిశీలించారు. గ్రామ పరిపాలనాధికారులు పరీక్షకు 276 మందికి 241 మంది హాజరు కాగా, 35మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) రాజ్‌కుమార్, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.

నేడు టీపీఎస్వీ ప్రచారజాత ప్రారంభం

నల్లగొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న ప్రచారజాతాను ప్రారంభించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలనే సందేశంతో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో ప్రచారజాతా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ప్రచారజాతాను మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటిరోజు నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడలో ప్రచారజాతా కొనసాగుతుందని తెలిపారు. 27న హాలియా, కొండమల్లేపల్లి, దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో కొనసాగుతుందని వెల్లడించారు. ఈ ప్రచారజాతాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గిరిజనులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

హాలియా,మే25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం (టీఆర్‌జీఎస్) శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతితో గిరిజన రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోందని, అందులో భాగంగానే తిరుమలగిరి సాగర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతులకు పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గిరిజనులను ఐక్యం చేసి హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలని అన్నారు. ఎస్టీలకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ. 25లక్షలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూములు పట్టాలు పొందిన రైతులకు నీటి వసతి, పెట్టుబడి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూడియా బాబు పీఠాధిపతి భగవాన్‌నాయక్, సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, నాయకులు రమావత్ శంకర్‌నాయక్, లాల్‌సింగ్, రమావత్ లలితాబాయ్, రమావత్ జవహర్‌నాయక్, ఆంగోతు వెంకన్న, చంద్రుడు, రాగ్యానాయక్, శ్రీను, సురేష్, భాస్కర్, అశోక్, లాలు, రమేష్, రాజు, శ్రీను, పాల్గొన్నారు.

భారత జవాన్లకు అండగా నిలుస్తాం

▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కేతావత్ లాలునాయక్ ▸ దేవరకొండలో ఆపరేషన్ తిరంగా ర్యాలీ



దేవరకొండలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, వివిధ పార్టీల నాయకులు

దేవరకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు అండగా నిలుస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన తిరంగా ర్యాలీని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ భారత జవాన్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పాకిస్థాన్‌తో పాటు ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. జమ్మూకాశ్మీర్ పహల్గాంలో అమాయక పర్యాటకులను తీవ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించి, దేశ ప్రజలకు భరోసా కల్పించినట్లు తెలిపారు. భారత ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటి కృష్ణ, రాష్ట్ర నాయకులు కల్యాణ్‌నాయక్, కర్నాటి సురేష్, నక్క వెంకటేష్‌యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, నాయకులు బెజవాడ శేఖర్, పున్న వెంకటేశ్వర్లు, సుదర్శన్, లింగయ్య, చనమోని రాములు, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీతో పాటు దేవరకొండ నియోజకవర్గానికి వివిధ పార్టీల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): ఏపీలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా మాట్లాడుతూ మహానాడు ఈ నెల 27 నుంచి 2 వరకు కడపలో జరగనుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు మహానాడుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పేదల చెంతకు కార్పొరేట్ స్థాయి వైద్యం

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. తక్కెళ్లపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి కోసం తన వంతుగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అభివృద్ధిని చూసి లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ దొంతం అలివేలూసంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, మాజీ సర్పంచులు గుండ్లపల్లి అనితానరసింహరెడ్డి, ముద్దం సత్తమ్మ మారయ్యగౌడ్, ఉప సర్పంచి మేతరి శోభారాణి ఏసు, రజకసంఘం మాస భాస్కర్, జె.నరసింహ, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలి



సభలో మాట్లాడుతున్న రమావత్ అంజయ్య నాయక్

దేవరకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై ప్రభుత్వం తన వైఖరిని చెప్పాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. మండలంలోని గదరాలతండాలో ఆదివారం నిర్వహించిన సీపీఐ గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. రైతు భరోసా ఎన్ని పంటలకు, ఎన్ని ఎకరాలకు ఇస్తారో స్పష్టం చేసి అపోహలను తొలగించాలని కోరారు. పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు టి.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ వంద ఏళ్ల సీపీఐ ఉద్యమ ప్రస్థానంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిందన్నారు. జూన్ 10న ఖానాపూర్‌లో నిర్వహించే పార్టీ డిండి మండల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకచారి, సోమిడి శ్రీనయ్య, కృష్ణ, పుల్లారెడ్డి, చక్రీ, కూన వెంకటయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టు జాతరను జయప్రదం చేయాలి



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

హాలియా, మే 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 31న టీజేఎఫ్ 25వ ఆవిర్భావ రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని టీయూడబ్ల్యూజే 143 జిల్లా యూనియన్ అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం హాలియాలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అవిర్భావానికి ముందు మీడియా అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ నాయకత్వంలో 2001 మే 31న టీజేఎఫ్ ఏర్పాటై జర్నలిస్టులను గొడుగు కిందికి తీసుకువచ్చి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ముందుకు నడిపి రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘ చర్చ జరపడానికి మహాసభ వేదికకానుందని జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు గాలెంక గురుపాదం, పోలగోని లక్ష్మీకాంత్, సల్వాది జానయ్య, మనాది రవీందర్, లట్టుపల్లి కాశీ, నియోజకవర్గ అధ్యక్షుడు, దొరేపల్లి ప్రసన్నకుమార్, కార్యదర్శి కోట్టే సైదులు, కమ్మంపాటి గురవయ్య, వనమాల కోటేష్, పడిశాల సైదులు, గాలి లింగారెడ్డి, రేపూరి దశరథ, నంది భిక్షం, పాక సుధాకర్, రమావత్ నరేష్, రవీందర్‌రెడ్డి, సైదయ్య, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత సామల యాదగిరి



యాదగిరి చిత్రపటం నివాళులర్పిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

హాలియా,మే25(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు సామల యాదగిరి ఉపాధ్యాయులకు స్ఫూర్తిప్రదాత అని ఆ సంఘం టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందా సైదులురావు, గౌతమ్ అన్నారు. అనుముల, తిరుమలగిరి, పెద్దవూర మండలాల పీఆర్‌టీయూ టీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం యాదగిరి వర్ధంతిని నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం, ఉపాధ్యాయుల వృత్తిలో నిబద్ధతను పెంపొందించేందుకు, విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం ఎనిలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో అనుముల మండల ప్రధాన కార్యదర్శి చెన్ను వెంకట్‌రెడ్డి, మొక్కు పరుశరాంగౌడ్, నారాయణదాసు, దుర్గాప్రసాద్, కుంచం హరివర్ధన్, కన్నంతరెడ్డి, జైపాల్‌రెడ్డి, నల్లబోతు వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో కొండమల్లేపల్లి విద్యార్థుల ప్రతిభ



స్పందన, రామకృష్ణ,శ్రావణి

కొండమల్లేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాలిటెక్నిక్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. స్పందన 2,081 ర్యాంకు, రామకృష్ణ 3,265 ర్యాంకు, శ్రావణి 5,112 ర్యాంకు, అజయ్ 10,083, నందిని 1044 ర్యాంకులు సాధించినట్లు హెచ్ఎం నాగేశ్వర్‌రావు తెలిపారు.

▸ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో తుంటి, మోకాలుచిప్పల మార్పిడి ▸ విజయవంతంగా పలు రకాల శస్త్రచికిత్సలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు అందుతున్నాయి. వంద పడకలతో విస్తరించిన తర్వాత మౌలిక సదుపాయా ల కల్పన మెరుగుపడడంతో అదేస్థాయిలో వైద్యసేవల్లోనూ మార్పులు జరిగాయి. వైద్యులు అంకితభావంతో పనిచేస్తుండడంతో రోగుల్లో ఓపీ, ఐపీల సంఖ్య పెరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)



చికిత్స పొందుతున్న రోగులు

మిర్యాలగూడ ఏరియా దవాఖానాలో సాధారణ శస్త్రచికిత్సతో పాటు కీలకమైన వైద్యసేవలను అందిస్తుండడంతో రోగులు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందేందుకు క్యూ కడుతున్నారు. గతంలో రోజుకు సుమారు 250 నుంచి 300 వరకు ఉన్న ఓపీ రేటు ప్రస్తుతం సుమారు 400 వరకు పెరిగింది. అదేవిధంగా ఇన్‌పేషెంట్ (ఐపీ)వార్డుల్లో చేర్చుకుంటున్న రోగుల సంఖ్య సైతం గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం శస్త్రచికిత్సల విభాగంతోపాటు సాధారణ వార్డులో రోగులకు వైద్యం అందిస్తున్నారు. రోగులకు సహాయకులు గా ఉండేవారికి ఉదయం అల్పహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని సమకూర్చుతున్నారు. దీంతో సామన్య, మధ్యతరగతి ప్రజల కు ఆర్థికపరమైన ఇబ్బందులకు చేరువ కాకుండానే ఉచిత వైద్యసేవలను పొందుతున్నారు.

ప్రతినెల సగటున 30 శస్త్రచికిత్సలు

మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి విస్తరించ గా, నాగార్జున సాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల పరిధిలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి ని విస్తరింపజేయడంతో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులను చేరువ లో ఉన్న మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి అత్యధికంగా తరలిస్తున్నారు. దీంతో ఆర్థోపెడిక్ విభా గం సేవలు కీలకంగా మారాయి. ఈ అవసరా న్ని గుర్తించిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారు లు ఆర్థోపెడిక్ వైద్యసేవల్లో పారదర్శకత పెం చేందుకు కృషి చేశారు. దీంతో ఈ విభాగంలో అత్యాధునిక వైద్యపరికరాలు సమకూర్చడంతో ప్రతినెల సగటున 30 శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. అందులో ప్రధానంగా తుంటి, మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 40 సర్జరీలను వైద్యులు విజయవంతంగా పూర్తిచేయగా, అందులో 22 తుంటిసర్జరీలు, 18 మోకాలు చి ప్పల మార్పిడి చికిత్సలు జరిగాయి. ఈ తర హ వైద్యాన్ని ప్రైవేటు ఆస్పత్రులో పొందాలంటే సు మారు రూ. 3లక్షల వరకు ఖర్చు వస్తుందని వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు ప్రతినెల 60వరకు సాధారణ సర్జరీలు, 120 వరకు నేత్ర శస్త్రచికిత్సలు, 10వరకు ఈఎన్‌టీ సర్జరీలను వై ద్యులు నిర్వహిస్తుండగా, ప్రసూతి వార్డులో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్నారు.

అనుభవజ్ఞులైన 30మంది వైద్యులు...

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి శస్త్రచికిత్సల విభాగాల్లో అనుభవజ్ఞులైన 30మంది డాక్టర్లు తమ సేవలను అందిస్తున్నారు. దీంతో చిన్నపిల్ల ల విభాగం, ఆర్థోపెడిక్, నేత్ర, ఈఎన్‌టీ విభాగాలతో పాటు సాధారణ శస్త్రచికిత్స విభాగాల్లో వైద్యసేవల నాణ్యత పెరిగింది. దీంతోపాటు ఆరోగ్యశ్రీ విభాగంలోనూ మెరుగైన వైద్యం అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండానే రుగా ప్రభుత్వ వైద్యానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగంలో ప్రతినెల 60 నుంచి 70వరకు వివిధ రకాల శస్త్రచికిత్సలు జరుగుతుండగా,హెర్నియా, హైడ్రోఫిల్ వంటి సర్జరీలు నెలకు 30 వరకు జరుగుతున్నాయి.

నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నాం



ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఆస్పత్రి విభాగాల్లో ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా సాధారణ వైద్యసేవలతోపాటు శస్త్రచికిత్సల విభాగాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో సఫలీకృతమవుతున్నాం. ప్రధానంగా కంటి, చెవు,ముక్కు,గొంతు విభాగలతోపాటు ఆర్థోపెడిక్ విభాగం వైద్య సేవలను ప్రజలు ఎక్కువగా పొందుతున్నారు. ఈ ఏడాది రికార్డుస్థాయిలో 40 తుంటి, మోకాలుచిప్పల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేయడంతో వైద్యుల పనితీరు ప్రశంసనీయం.

- డాక్టర్ శ్రీనివాస్ సమరధ్, సూపరింటెండెంట్

పైసా ఖర్చు కాకుండా వైద్యం అందుతోంది



నా భర్త కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అరికాలులో ఇనుప చువ్వ దిగి వెముక దెబ్బతిన్నది. ప్రైవేటు ఆస్పత్రి వెళ్తే రూ. లక్ష వరకు ఖర్చవుతుందన్నారు. అంత స్థోమతలేక ఏరియా ఆస్పతి కొచ్చాం... డాక్టర్లు పరీక్షించి శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడు నాభర్త కోలుకుంటున్నాడు. డాక్టర్లు మంచి వైద్యం అందిస్తున్నరు. ఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్యం అందుతోంది. మరో పది రోజుల్లో నడిచేందుకు వీలుగా గాయం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

- ఎం. మౌనిక(బొకమంతులపాడు, నిడమనూరు మండలం)

కొండమల్లేపల్లి సీఐ పోస్టు భర్తీ ఎప్పుడో ?

● 4 నెలలుగా ఖాళీ ● ఇన్‌చార్జి సీఐగా డిండి సీఐ సురేష్ ● రెగ్యులర్ సీఐని నియమించాలని ప్రజల వేడుకోలు



కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్

దేవరకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లి సీఐ పోస్టు ఖాళీ అయి నాలుగు నెలలు అవుతోంది. ప్రస్తుతం నాంపల్లి మండల సీఐ రాజు ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లి, చింతపల్లి సెంటర్లు ప్రతిష్ఠాత్మకమైనవి. కొండమల్లేపల్లి జాతీయ రహదారి కావడంతో వీఐపీల రద్దీ అధికంగా ఉంటుంది. జిల్లాలోనే అతిపెద్ద సంత కొండమల్లేపల్లిలోనే కొనసాగుతుంది. నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, గుంటూరు జిల్లాలతోపాటు తెలంగా ణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఆదివారం కొండమల్లేపల్లిలో జరిగే వారంతపు సంతకు వచ్చి వ్యాపారాలు చేస్తుంటారు. ఇటీవల నాగార్జునసాగర్ పర్యటనకు ప్రపంచ దేశాల నుంచి సుందరీమణులు సందర్శించారు. హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లి మీదుగా నాగార్జున సాగర్‌కు వెళారు. నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లి సీఐగా వచ్చేందుకు పలువురు పోటీ పడుతున్నట్లు సమాచారం.

కొండమల్లేపల్లి సర్కిల్ పరిధిలో గుడిపల్లి, కొండమల్లేపల్లి, గుర్రంపోడు మండలాల పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. కొండమల్లేపల్లి సీఐగా పనిచేసిన ధనంజయ్యగౌడ్ పలు ఆరోపణలు రావడంతో డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి సీఐ పోస్టు ఖాళీ ఏర్పడింది. ఇన్‌చార్జి సీఐగా నాంపల్లి సీఐ రాజు సెలవుపై వెళ్లారు. దీంతో డిండి సీఐ సురేష్ అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా డిండి సర్కిల్ కొండమల్లేపల్లి దూరంగా ఉండడంతో సకాలంలో సీఐ కొండమల్లేపల్లి సర్కిల్‌కు చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌కు రెగ్యూలర్ సీఐని నియమించాలని సర్కిల్ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



కొండమల్లేపల్లిలో బొడ్రాయి వద్ద బోనాలతో మహిళలు

కొండమల్లేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్వహించిన బొడ్రాయి (నాభిశిల) తృతీయ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అంతకుముందు మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నాయిని జమునామాధవరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ వేణుధర్‌రెడ్డి, దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, యుగంధర్‌రెడ్డి, నీల లక్ష్మయ్య, గంధం సురేష్, బూడిద వెంకటేష్‌యాదవ్, బూడిద మల్లేష్‌యాదవ్, మంగ్యనాయక్, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో ట్రాఫిక్ జామ్

కొండమల్లేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాభిశిల (బొడ్రాయి)ఉత్సవాల ఆదివారం పశువుల సంత జరగడంతో స్థానిక చౌరస్తాలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్ల మీదనే తోపుడు బండ్లు, కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో జాతీయ రహదారి 167పై ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. స్థానిక చౌరస్తాలో టాఫ్రిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లుగా వాహనాలు నడపడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి సానిక చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్‌ని ఏర్పాటు చేయాలని, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.




కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద నిలిచిపోయిన వాహనాలు

రఫాయల్ మృతికి సంతాపం

కొండమల్లేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి ఎటుగూడి రఫాయల్ (79) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందారు. ఆయన గ్రామపంచాయతీ పరిధిలో 1992లో సంజీవని ట్రస్ట్ పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేదలకు విద్య వైద్య తదితర సేవలందించిన ఆయన మృతి పట్ల పలువురు సం తాపం వ్యక్తం చేశారు. కాగా సోమవారం సంజీవని ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు

● నూరుశాతం ఫలితాలతో రాణిస్తున్న పిట్టలగూడెం మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు ● విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ



పిట్టలగూడెంలోని మైనారిటీ కళాశాల

(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)

మండలంలోని పిట్టలగూడెం గ్రామ మైనారిటీ గురుకులాల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన జూనియర్ కళాశాల రెండేళ్లుగా నూరు శాతం ఫలితాలు సాధిస్తోంది. సాగర్ నియోజకవర్గానికి 2017లో మైనారిటీ గురుకుల పాఠశాల మంజూరు కావడంతో గుర్రంపోడులో పాఠశాల ఏర్పాటుకు భవనాలు లభించలేదు. దీంతో నిడమనూరు మండలం వేంపాడు వద్ద పాఠశాలను నెలకొల్పారు. 2021లో పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులకు సరిపడా వసతులు లేకపోవడంతో కళాశాలను గుర్రంపోడుకు మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో పిట్టలగూడెం గ్రామంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో మైనార్టీ కళాశాల ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. రూ. 18 లక్షలతో మరమ్మతు లు చేసి విద్యార్థులకు సరిపడా అన్ని వసతులు కల్పించారు. 2023లో కళాశాలను పిట్టలగూడేనికి తరలించారు.

కళాశాలలో సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో రెండేళ్లుగా కళాశాలలో విద్యార్థులు నూరుశా తం ఫలితాలు సాధిస్తూ కార్పొరేట్‌కు దీటుగా ప్రతిభ కనబరుస్తున్నారు, విద్యతో పాటు ఆటల్లో రాణిస్తూ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో కబడ్డీ ఖోఖో వాలీబాల్ లాంటి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో సీఈసీలో దారం చరణ్ అనే విద్యార్థి 928 మార్కులు, ఎం ఈసీలో ఇటికాల కౌశిక్ 900 మార్కులు సాధించి ప్రతిభ కనబరుస్తున్నారు. కళాశాలకు చెందిన సాయి మనోజ్ గతేడాది కర్నాటకలో జరిగిన అండర్ -19 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఎస్‌జీఎఫ్, సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో విద్యార్థులు రాణిస్తున్నారు.

కళాశాలలో నాణ్యమైన విద్య



కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు వసతి కల్పిస్తున్నాం. కళాశాలలో గ్రూపునకు 40 సీట్ల చొప్పున 80 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 సీట్లు మైనార్టీలకు, 20 సీట్లు నాన్ మైనారిటీలకు ఉన్నాయిచ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- మహ్మద్ ఫారూఖ్, ప్రిన్సిపాల్

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దుర్గాప్రసాద్

మిర్యాలగూడ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కత్తురోజు దుర్గాప్రసాద్ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. వంశపారంపర వైద్యరంగంలో దుర్గాప్రసాద్ అందిస్తున్న సేవలను గుర్తించిన గ్లోబల్ అచీవర్స్ కౌన్సిల్ డాక్టరేట్ పురస్కారానికి ఎంపిక చేసింది. శనివారం ఢిల్లీలో జరిగిన సౌత్ వెస్ట్రన్ అమెరికా యూనివర్సిటీ కాన్వొకేషన్ కార్యక్రమంలో దుర్గాప్రసాద్ డాక్టరేట్ పురస్కారం పొందారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు దుర్గాప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ టూటౌన్ అధ్యక్షుడిగా వీటీయాదవ్

మిర్యాలగూడ టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ టూటౌన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పెద్దబోయిన వీటీయాదవ్ నియమితులయ్యారు. అధ్యక్ష కార్యదర్శులతో పాటు కార్యవర్గసభ్యులను జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రకటించారు. ప్రధానకార్యదర్శులుగా గుండ్లపల్లి శ్రీకాంత్, బాషపాక శంకర్ నియమితులు కాగా కోశాధికారిగా రవికుమార్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా ఐల శ్రీను, నందికొండ హరిప్రసాద్, కనపర్తి రాంప్రసాద్, ధైద నిరంజన్‌రెడ్డి, కార్యదర్శులుగా కోరుపుల యాదగిరి, యడవెల్లి నాగరాజు, ధీరావత్ మాణిక్‌లాల్, గోలి రేణుక ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సాయివెంకట్, నరేష్, ఆనంద్‌బాబు, వెంకటేశ్వరి, స్వరాజ్యం, సుజాత, సంజీవ్, విజయ్, శ్రవణ్‌కుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు. తన నియామకానికి సహకరించిన అందరికీ వీటీ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

మిర్యాలగూడ: శ్రీనివాస	: సింగిల్
వెంకటేశ్వర	: ఏస్
రాఘవ	: హిట్ 3
విట్రోస్	: ఏస్, వర్షం
దేవరకొండ : మనోజ్	: ---
మైత్రి వెంకటేశ్వర	: శుభం